


విద్యుత్ లేకపోవడంతో ఉక్కపోతలోనే పిల్లలు


కేజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో సెల్‌ఫోన్ వెలుతురులో రోగులు

అంధకారంలో పెద్దాస్పత్రి!

కేజీహెచ్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

- మార్చురీ వద్ద పనులు చేస్తుండగా తెగిపోయిన కేబుల్
- పునరుద్ధరణపై దృష్టిసారించని అధికారులు
- వార్డుల్లో చిమ్మ చీకట్లతో రోగుల అవస్థలు
- అత్యవసర విభాగాలకు జనరేటర్ ద్వారా సరఫరా
- నీటి సరఫరా కూడా బంద్

మహారాణిపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని కేజీహెచ్‌లో గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు అలముకున్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి భావనగర్ వార్డు, రాజేంద్రప్రసాద్ వార్డు, పిల్లల వార్డు, గైనిక్ వార్డు, సీఎస్ఆర్ బిల్డింగ్‌లోని కొన్ని విభాగాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


కొవ్వొత్తులు, మొబైల్ లైట్ వెలుగులో నర్సుల డ్యూటీ

ఆస్పత్రి మార్చురీలో అండర్ గ్రౌండ్ పనులు నిర్వహిస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో ప్రధాన వార్డులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో ఆక్సీ జన్, ఐసీయూ, వెంటిలేటర్ సేవలందించే అత్యవసర విభాగాలు ఉన్న సీఎస్ఆర్ బిల్డింగ్, భావనగర్ వార్డు లోని అక్యూట్ మెడికల్ విభాగానికి జనరేటర్ ద్వారా విద్యుత్ సరఫరా చేశారు. మిగిలిన వార్డులలోని రోగు లు తీవ్ర ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. విద్యుత్ లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా మరుగుదొడ్లు వినియోగించేవారు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆ పరిసరాలన్నీ అస్తవ్యస్తంగా

... మిగతా 4వ పేజీలో

వైఫల్యాన్ని దాచిపెట్టి... కాంట్రాక్టర్‌కు దోచిపెట్టి!

గ్రేటర్‌లో ప్రజాధనం దుర్వినియోగం

- సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహణలో గాజువాక కాంట్రాక్టర్ విఫలం
- ఆ విషయం మరుగున పెట్టి యంత్రాలు పాతవైపోయాయని, కొత్తవి కొనుగోలు చేయాలని డంపింగ్ యార్డు పరిశీలనకు వెళ్లిన స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ ఎదుట అధికారుల ప్రతిపాదన
- రూ.పది కోట్ల ఖర్చు...


గాజువాక యార్డును పరిశీలిస్తున్న స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, వెనుకన ఓపెన్‌టిప్పర్‌లో కాపులుప్పాడ తరలించేందుకు సిద్ధంగా ఉన్న చెత్త

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గాజువాకలో క్లోజ్డ్ కాంపాక్టర్ సిస్టమ్ (సీసీఎస్) ప్రాజెక్టు నిర్వహణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేసేందుకు కాంట్రాక్టర్, అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టు నిర్వహణలో కాంట్రాక్టర్ విఫలమైన విషయాన్ని దాచిపెట్టిన అధికారులు ప్రస్తుతం అక్కడున్న యంత్రాలు పాతవైపోవడంతో సరిగా పనిచేయడం లేదని, వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు ప్రతిపాదించారు.

నగరంలోని చెత్తను ఓపెన్ టిప్పర్లతో కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడం వల్ల పర్యావరణ సమస్యతోపాటు రోడ్డు ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీసీఎస్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు కింద ఏ జోన్‌లో ఉత్పత్తి అయిన చెత్తను అదే జోన్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (యార్డు) వద్ద యంత్రాల్లో వేసి కంప్రెస్ చేసి కంటెయినర్ లాంటి హుక్ లోడర్ ద్వారా యార్డుకు తరలించేలా ఏర్పాటుచేశారు. అందులో భాగంగా గాజువాకలో కూడా 2019లో రూ.8.5 కోట్లతో సీసీఎస్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చారు. రెండు హుకాపర్లతో పాటు చెత్తను తరలించేందుకు ఐదు హుక్‌లోడర్లు (కంటెయినర్ వాహనాలు)ను సమకూర్చారు. యంత్రాలతోపాటు వాహనాలకు ఇంధనం జీవీఎంసీయే సరఫరా చేస్తుంది. నిర్వహణ బాధ్యతను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దీనికోసం కాంట్రాక్టర్‌కు ఏడాదికి రూ. రెండు కోట్లు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. రెండు హుకాపర్లతోపాటు, ఐదు హుక్ లోడర్లకు రిపేర్లు, వాటికి అవసరమైన విడిభాగాలను ఎప్పటికప్పుడు మార్చుకోవడం ద్వారా పని సక్రమంగా జరిగేలా కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉంటుంది. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఒక హుకాపర్ పనిచేయడం లేదు. అలాగే ఒక హుక్‌లోడర్ 16 నెలల కిందట రోడ్డు ప్రమాదానికి గురికాగా ఇప్పటికీ దానికి మరమ్మతు జరగలేదు. హుక్‌లోడర్ షెడ్‌లో ఉన్నప్పటికీ సుమారు రూ.21 లక్షలు డీజిల్‌ను ఆ వాహనం పేరుతోనే కాంట్రాక్టర్ తీసుకుని ఇతర వాహనాలకు సర్దుబాటు చేసుకున్నారనే ఫిర్యాదులు ఉన్నా, రికవరీ చేయడానికి అధికారులు యత్నించలేదు. తాజాగా నాలుగు రోజుల కిందట ఒక హుక్ లోడర్ అక్కిరెడ్డిపాలెం వద్ద రోడ్డుప్రమాదానికి గురైంది. ఆ విషయం సోషల్ మీడియాలో ఎవరో పోస్ట్ చేసేంత వరకూ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు తెలియదు. రెండు హుక్ లోడర్లు, ఒక హుకాపర్ పనిచేయకపోతే కాంట్రాక్టర్ వాటిని మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలి. కానీ, అదేమీ లేకుండా ఓపెన్ టిప్పర్లతో చెత్తను

... మిగతా 4వ పేజీలో

ప్లాట్లు కొట్టేస్తున్నారు!

ఉక్కు నిర్వాసిత కాలనీల్లో స్థలాల కబ్జా

- తప్పుడు డాక్యుమెంట్లతో విక్రయం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఉక్కు భూ సేకరణ విభాగం


అక్రమంగా నిర్మిస్తున్న ఇల్లు

విశాఖపట్నం/గాజువాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

ఉక్కు నిర్వాసిత కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాలను కొందరు కబ్జా చేస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి జీవీఎంసీ నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకుంటున్నారు. వడ్లపూడి నిర్వాసిత కాలనీలోని సర్వే నంబరు 13లో రమాదేవి మహిళా మండలికి ఉపాధి కార్యక్రమాల నిర్వహణకుగాను ఉక్కు భూసేకరణ అధికారులు స్థలం కేటాయించారు. ఇందులో కమ్యూనిటీ హాలు నిర్మించగా, మిగిలినది ఖాళీగా ఉంది. ఉత్తరంగా రోడ్డు, దానికి ఆనుకుని పార్కింగ్, ఇతర అవసరాలకు కొంత స్థలాన్ని విడిచిపెట్టారు. అయితే స్థానికంగా కొందరు నకిలీపత్రాలు సృష్టించి ఆ స్థలం కబ్జా చేశారు. మూడు ప్లాట్లు వేసి విక్రయించేశారు. అధికారులను నమ్మించేందుకు ఓ మహిళ పేరిట నకిలీ పట్టా సృష్టించారు.

ఉక్కు కాలనీలు ఏర్పాటైన తరువాత నిర్వాసితుల కుటుంబంలో ఒకరికే స్థలం ఇచ్చారు. అయితే నకిలీపత్రాలు సృష్టించిన వ్యక్తికి ఒకేచోట మూడు ప్లాట్లు ఎలా కేటాయించారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీపత్రాలతో విక్రయించిన ప్లాట్ల నంబర్లు ఇంకో చోట ఉన్నట్టు చెబుతున్నారు. ఈ వ్యవహారం వెనుక రిటైర్డు పోలీస్ కానిస్టేబుల్ హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. గతంలో వడ్లపూడిలో మూడెకరాల భూమి కబ్జాకు స్కెచ్ వేసి బెడిసికొట్టడంతో వెనకడుగు వేసిన మాజీ కానిస్టేబుల్, ఈ ప్రాంతంలో పలు కబ్జాలకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. పోలీసులు,

... మిగతా 4వ పేజీలో


రామవరం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలపై అధికారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబు

డిసెంబరుకల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి

- అధికారులకు గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు ఆదేశాలు
- రామవరం, గంగవరం లేఅవుట్‌లలో పనులు పరిశీలన
- నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచన

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

నగరంలో పేదల కోసం శివారు ప్రాంతాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ఎండీ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. గురువారం విశాఖ విచ్చేసిన ఆయన ఆనందపురం మండలం రామవరం, అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గంగవరంలో ఇళ్ల కాలనీలను సందర్శించి కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని స్పష్టంచేశారు. లేఅవుట్‌లలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్, పచ్చదనం తదితర అంశాలపై చర్చించారు. కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లను అధికారులు తనిఖీ చేసిన అనంతరం యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తిస్థాయిలో వివరాలు సమర్పించిన తరువాత మాత్రమే బిల్లులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శివారుల్లో 65

... మిగతా 4వ పేజీలో

గుట్టుగా ఏసీబీ విచారణ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండో రోజూ కొనసాగిన సోదాలు

- పెండింగ్ డాక్యుమెంట్లపై ఆరా
- షాపులు మూసేసిన డాక్యుమెంట్ రైటర్లు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజూ కొనసాగాయి. సూపర్‌బజార్, మధురవాడ, పెదగంట్యాడ కార్యాలయాల్లో గురువారం మరింత లోతుగా పరిశీలన చేశారు. కార్యాలయాల్లో పెండింగ్ డాక్యుమెంట్లపైన, రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత డాక్యుమెంట్లు కొనుగోలుదారులకు ఇవ్వకుండా ఉంచడంపైనా ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిన రోజే డాక్యుమెంట్ సంబంధిత పార్టీకి అప్పగించాలి. కానీ కొన్ని డాక్యుమెంట్లు వారాల తరబడి కార్యాలయంలోనే ఉండడంపై అనుమానాలు కలిగి వాటిపై ప్రశ్నించినట్టు సమాచారం. రిజిస్ట్రేషన్ పూర్తయిన డాక్యుమెంట్లను ఇంతకు ముందులా డాక్యుమెంట్ రైటర్లకు ఇవ్వడం లేదని, కొనుగోలుదారుడే బయోమెట్రిక్ వేసి తీసుకువెళ్లాల్సి ఉందని, వారు రాకపోవడం వల్లే ఇవ్వలేకపోయామని సబ్ రిజిస్ట్రార్లు వివరించినట్టు తెలిసింది. లంచాల వ్యవహారం ఆశించిన స్థాయిలో బయటకపోవడంతో ఏసీబీ అధికారులు పెండింగ్ డాక్యుమెంట్ల ద్వారా ఏమైనా తెలుస్తుందేమోనని ఆయా పార్టీలతోను మాట్లాడినట్టు చెబుతున్నారు. అందుకనే మధురవాడలో రికార్డ్ రూమ్‌కు బుధవారం రాత్రి సీల్ చేశారు.


మధురవాడలో రికార్డ్ రూమ్‌కు సీలు వేసిన దృశ్యం

డాక్యుమెంట్ రైటర్ల షాపులు మూసివేత

సూపర్‌బజార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీ చేసినప్పుడు డాక్యుమెంట్ రైటర్ల సహాయకులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర డబ్బులు, డాక్యుమెంట్ల వివరాలు స్టేట్‌మెంట్లలో పెట్టారు. దాంతో భయపడిన డాక్యుమెంట్ రైటర్లు గురువారం షాపులు మూసేసి వెళ్లిపోయారు.

భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు



- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

- 4వ పేజీలో

నగరానికి నూతన సొబగులు

- పెట్టుబడుల సదస్సు నేపథ్యంలో కూడళ్లలో కళాకృతుల ఏర్పాటు


సంపత్ వినాయకుడి ఆలయం సమీపంలో మూడు గుర్రాలు...

నగరంలోని జంక్షన్లు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు జరగనున్న నేపథ్యంలో అధికారులు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ప్రముఖులు పర్యటించే మార్గాల్లో జంక్షన్లను ప్రత్యేకంగా మారుస్తున్నారు. ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి సంపత్ వినాయకుడి ఆలయానికి వెళ్లే మార్గంలో వేమన మందిరం ఎదురుగా కూడలిలో కొద్దిరోజుల క్రితం వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.ఇప్పుడు దానిని తీసేసి గుర్రాల విగ్రహాలను పెట్టారు. అదేమార్గంలో సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వరకూ పలు జంక్షన్లలో రకరకాల కళాకృతులను పెట్టారు. ఆ ఐల్యాండ్లను కూడా సైజులు మార్చి, కొత్త మొక్కలు వేస్తున్నారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


సిరిపురం జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఆర్టిఫిషియల్ పువ్వులు

నేటి ఉదయం 10 గంటలకు

వందేమాతర గీతం ఆలాపన

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి):

వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం పది గంటలకు అన్ని పాఠశాలల్లో సామూహికంగా వందేమాతన గేయాన్ని ఆలపించనున్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలల యాజమాన్యాలకు డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ ఆదేశాలు జారీచేశారు. ఇందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాటుచేసుకోవాలన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

అప్పన్నకు సిరి సంపెంగల పూజ



సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనార సింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాదనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ సిరి సంపెంగలతో పూజ చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

రహదారి వివాదంపై ఆర్‌డీఓ ఉత్తర్వులు

తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలో సంగివలస నుంచి లోపలికి వెళ్లే రహదారి తమకు చెందిన జిరాయితీ స్థలమని కొంతమంది చెబుతుండగా, అది ఎప్పటి నుంచో రహదారిగా ఉందని రోడ్డు అవతల పక్కన ఉన్న నివాసితులు అంటున్నారు. ఈవిషయమై కొద్ది రోజులుగా వివాదం కొనసాగుతోంది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు తహశీల్దార్ రామారావు, రెవెన్యూ అధికారులు రోడ్డును పరిశీలించారు. ఈమేరకు ఆర్‌డీఓ సంగీత్ మాథూర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రికార్డుల ప్రకారం సర్వే నంబర్లు 23, 25లో ఉన్న స్థలం రహదారిగానే నమోదై ఉందని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టరేట్‌కు లేఖ రాశామన్నారు.

17న పీఎఫ్ కార్యాలయం ముట్టడి

తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పీఎఫ్ కమిషనర్ కార్యాలయాన్ని ఈనెల 17వ తేదీన ముట్టడించనున్నట్టు కార్మిక పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కానూరి రాంబాబు తెలిపారు.గురువారం చిట్టివలసలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు డి. బాబాజీ, మోర అప్పలరాజు, దల్లి రాంబాబు, మాదాబత్తుల రామారావు, పోతు రాజు, లక్ష్మణరావు, సన్నిబాబు, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

170 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిప్పాడ దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం జిల్లా పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు మనస్వి 170 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్ కుమార్, కె. నరసింహ, ఎ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో 'పీస్ పోస్టర్' పోటీలు

భీమునిపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సెంటేనియల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిస్ట్రిక్టు పీస్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు గురువారం నిర్వహించారు. గుప్తా వీధిలోని సాయి సదనంలో జరిగిన ఈ పోటీలకు స్థానికంగా ఉన్న 11 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ, ద్వితీయ బహుమతిని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. తృతీయ బహుమతి జీవీఎంసీ పండిట్ నెహ్రూ హైస్కూల్ విద్యార్థినికి లభించింది. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు. మరో 15 మందికి కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్టు పీస్ పోస్టర్ చైర్మన్ లయన్ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ పోటీలను లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ నిర్వహిస్తుందన్నారు.గెలుపొందిన వారిని డిస్ట్రిక్టుకు, తర్వాత ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో భీమిలి సెంటేనియల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీఎస్ నాయుడు, కార్యదర్శి జి. శ్రీనివాసరావు, కోట మల్లికార్జునరావు, కోట పద్మారాణి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, గాడు సన్యాసినాయుడు, చాగంటి సుబ్బారావు, ఎంవీ పార్వతీశం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

సబ్బవరం (అనకాపల్లి జిల్లా), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జోడుగుళ్ల సమీపంలో వున్న బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడికి చెందిన పత్తిపాటి వీరబాబు(19) స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా ఈ ఏడాది జోడుగుళ్ల వద్దగల బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో చేరాడు. ఈ నేపథ్యంలో ఇంటికి వెళ్లి వస్తానని బుధవారం సాయంత్రం ప్రిన్సిపాల్ బలిరెడ్డి ఉమామహేశ్వరరావుకు మెసేజ్ పెట్టాడు. తమ కుమారుడిని ఇంటికి పంపాలని వీరబాబు తల్లిదండ్రుల నుంచి కూడా సమాచారం వచ్చింది. దీంతో ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారు. గురువారం ఉదయం ఆరు గంటలకు విద్యార్థులంతా పీటీకి బయలుదేరారు. వీరబాబు రాకపోవడంతో వారు ప్రశ్నించారు. తాను ఇంటికి వెళుతున్నానని, ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారని చెప్పాడు. దీంతో తోటి విద్యార్థులు పీటీకి వెళ్లిపోయారు. తిరిగి 7.20 గంటలకు రూమ్‌కు వచ్చి చూడగా వీరబాబు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పరిశీలించగా వీరబాబు అప్పటికే మృతి చెందాడు. అనంతరం ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని కిందకు దించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



ఐదో వార్డు కార్పొరేటర్ హేమలతకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే గంటా



భీమిలిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- ఏడో వార్డులో రూ.7.3 కోట్లతో పలు పనులకు శంకుస్థాపన

మధురవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన కార్పొరేటర్ పిల్లా మంగమ్మతో కలిసి ఏడో వార్డు ఎన్‌జీఓ కాలనీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడో వార్డులో కాలువలు, రహదారులు, రక్షణ గోడ తదితర సమస్యలను కార్పొరేటర్ మంగమ్మ తన దృష్టికి తీసుకువచ్చారని, ఈమేరకు జీవీఎంసీ నుంచి రూ. 7.3 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. భోగాపురం విమానాశ్రయం వచ్చేఏడాది జూలైకు పూర్తవుతుందని, ఆలోగా నియోజకవర్గంలో కొన్ని రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా భీమిలి బీచ్ రోడ్డు, మెయిన్ రోడ్, టెంపుల్ రోడ్‌తో పాటు తగరపువలస నుంచి ఎయిర్ పోర్టుకు వెళ్లే రహదారులను విస్తరించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే వీటికి సంబంధించిన నాలుగు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి తగిన నష్టపరిహారం చెల్లించి పనులు కొనసాగిస్తామన్నారు. భవిష్యత్తులో అభివృద్ధి అంతా మధురవాడ చుట్టూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయానికి నగరానికి మధ్య ఉన్న మధురవాడ హైదరాబాద్ గచ్చిబౌలీ తరహాలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు కూడా నగర కార్పొరేషన్‌లో విలీనం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. గ్రామాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందాలంటే విలీనం తప్పదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిల్లా వెంకట్రావు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి దుర్గారావు, కూటమి నాయకులు కలివేల్పు సూరిబాబు, నాగోతి శివాజీ, కానూరి అచ్యుతరావు, మొల్లి లక్ష్మణరావు,వాండ్రాసి అప్పలరాజు, గుదే అచ్యుతరావు,నాగోతి నరసింహనాయుడు, పిళ్లా రాము, 8వ వార్డు కార్పొరేటర్ అప్పారావు, నాగోతి సత్యనారాయణ, గరే గురునాథ్, జోన్-2 జడ్సీ కనక మహాలక్ష్మి, జోనల్ కార్యాలయం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం భవనానికి శంకుస్థాపన

భీమునిపట్నం : పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం భవనాన్ని త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన డైట్ కళాశాల జంక్షన్‌లో వసతి గృహం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.4.50 కోట్లతో నిర్మించనున్న భవనాన్ని ఆధునాతన సదుపాయాలతో విద్యార్థులకు సౌకర్యవంతంగా నిర్మించాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ సత్యనారాయణ, టీడీపీ నాయకులు చిక్కాల విజయ్‌బాబు,కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు, గొలగాని నరేంద్ర కుమార్, సరగడ అప్పారావు, లక్ష్మీకుమారి, కురిమిన లీలావతి, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, వి. పోతురాజు పాల్గొన్నారు.

ఘనంగా హేమలత జన్మదిన వేడుకలు

కొమ్మాది : చిన్న వయసులోనే కార్పొరేటర్‌గా ఎన్నికై సమస్యల పట్ల అవగాహన పెంచుకుని ప్రజా క్షేత్రంలో రాణించడం అభినందించదగ్గ విషయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం 5వ వార్డులో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన మొల్లి హేమలత జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజర య్యారు. హేమలతతో కేక్ కట్ చేయించి తినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హేమలత ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగానే స్టాండింగ్ కమిటీ మెంబర్‌గా అవకాశం లభించిందన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మొల్లి లక్ష్మణరావు, చిక్కాల విజయ్‌బాబు, వాండ్రాసి అప్పలరాజు, కార్పొరేటర్లు మంగమ్మ, శ్రావణి, మంగవేణి, గాడు చిన్నలక్ష్మీకుమారి, పి.వి. నరసింహం, గంటా నూకరాజు,పిళ్లా వెంకట్రావు, గరే గురునాథ్, నాగోతి సత్యనారాయణ, గొల్లంగి ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంగివలసలో మళ్లీ దుకాణాల ఏర్పాటు



చెరువు పక్కన ఏర్పాటు చేస్తున్న దుకాణాలు

తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు సంగివలస చెరువు ప్రాంతంలో మళ్లీ దుకాణాలు వెలిసాయి. ఇక్కడికి సమీపంలో కొత్తమ్మ తల్లి గుడి ఉంది. జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాన్ని ఎత్తు చేయడానికి అధికారులు ఇటీవల మట్టి వేశారు. రెండు నెలలు క్రితం తగరపువలస ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలో రహదారి కాలువ గట్లపై ఉన్న అనధికార దుకాణాలను జీవీఎంసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా తొలగించారు. తొలగించిన దుకాణాలను తగరపువలసలో అన్నా క్యాంటీన్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఉంచారు. వీటిని కొందరు వ్యాపారులు గురువారం క్రేన్‌ల సహాయంతో తీసుకువచ్చి మళ్లీ అదే స్థలంలో పెట్టారు. ఇప్పటివరకు ఎనిమిది దుకాణాలు ఏర్పాటు చేయగా మరికొన్నింటిని కూడా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. చెరువు ఆయకట్టు రైతుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేకపోవడం వల్లే వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. స్థానికులు కొంతమంది అడ్డగిస్తే దుకాణదారులు ఘర్షణ పడుతున్నారు. కాగా ఈ విషయమై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ చెరువు సమీపంలో సర్వీసు రోడ్డును ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగిస్తామన్నారు. గతంలో ఆక్రమణలను తొలగించామని, మళ్లీ అదే పని చేస్తున్నారని చెప్పారు. ఆక్రమిత స్థలంలో ప్రయాణికుల కోసం బస్ షెల్టర్ నిర్మించడానికి ప్రతిపాదనలు చేశామని తెలిపారు.

10న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

భీమునిపట్నం,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 8555868681, 9948768778 ఫోన్ నంబర్లను సంప్రతించాలన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతు

సాగర్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని కూడళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలకు జీవీఎంసీ సిబ్బంది గురువారం మరమ్మతులు చేపట్టారు. బీచ్‌రోడ్డులో వాహనాల వేగ నియంత్రణ, బైక్ రేసుల కట్టడి, ప్రమాదాల నివారణ, తదితర వాటి కోసం గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణపై శ్రద్ధ చూపకపోవడంతో చాలావరకు మరమ్మతుకు గురయ్యాయి.నగరంలో పెట్టుబడుదారుల సదస్సు జరగనుండడంతో భద్రతా కారణాల దృష్ట్యా కెమెరాలకు మరమ్మతు చేస్తున్నారు.



బీచ్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించిన బ్లూఫ్లాగ్ కార్మికులు

రుషికొండ బీచ్‌లో 'బ్లూ ఫ్లాగ్' కార్మికుల ఆందోళన

సాగర్‌నగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌కి వెళ్లే ప్రధాన రహదారిపై బ్లూఫ్లాగ్ నిర్వహణ కాంట్రాక్టు కార్మికులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా కాంట్రాక్టు పొందిన వారు తమను వేధించమే కాకుండా అకారణంగా విధుల నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. 31 మంది కార్మికులు బీవీకే సంస్థ దగ్గర నుంచి ఏపీ టూరిజం నిర్వహణలో పారిశుధ్య నిర్వహణ, టికెట్ కలెక్టింగ్, విద్యుత్, సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తూ వస్తున్నామన్నారు. కొత్తగా కాంట్రాక్టు పొందిన వారు తమను పొమ్మనకుండా పొగపెడుతున్నారని ఆరోపించారు. మహిళా కార్మికులకు నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో విధులు అప్పగిస్తున్నారని తెలిపారు. కొత్తగా కాంట్రాక్ట్ పొందిన వారికి సంబంధించిన వ్యక్తి బీచ్‌లో మద్యం సేవించడంతో పాటు వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడి, మూడు రోజులుగా విధులకు రానివ్వడం లేదన్నారు. పర్యాటక శాఖాధికారులు స్పందించి న్యాయం చేయకపోతే శుక్రవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా ఈ విషయమై బీచ్ మేనేజర్ (కాంట్రాక్ట్) శంకర్ మాట్లాడుతూ నెల రోజుల క్రితమే బీచ్ నిర్వహణను ఏపీ టూరిజం నుంచి పీజే గ్రూప్ తీసుకుందన్నారు. గతంలో పని చేసిన వారినే కొనసాగిస్తున్నామని, కొంతమందికి ప్లేస్‌మెంట్ మారుస్తుండడం నచ్చక ఫిర్యాదు చేశారని తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు సహకరించిన ఇద్దరి అరెస్టు

ఎండాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డు ఉక్కు ఉద్యోగికి అధిక లాభాలు ఆశ చూపి రూ. 15 లక్షల కొట్టేసిన కేసులో సైబర్ నేరగాళ్లకు అకౌంట్లు అందించిన ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నగరంలోని కూర్మనపాలెంకు చెందిన రిటైర్డు ఉద్యోగిని (76) టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయం చేసుకుని గోద్రెజ్ ప్రాపర్టీస్ గ్రూపులో యాడ్ చేశారు. ఆయనకు లింక్ పంపించి పార్ట్ టైమ్ జాబ్ చేసుకోవచ్చంటూ మెసెజ్‌లు పెడుతూ కొన్ని టాస్కులు ఇచ్చి కొంతమేరకు నగదు పంపించి నమ్మకం కుదిరేలా చేశారు. తరువాత అతని బ్యాంకు ఖాతా నుంచి ఎన్ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్, యూపీఐల ద్వారా రూ. 15 లక్షల కొట్టేశారు. ఈమేరకు తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన కొప్పెర విష్ణువర్ధన్, ఏపీలో నంద్యాల జిల్లాకు చెందిన షేక్ హుస్సేన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఐఐ సదస్సుల్లో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు



విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :ఈనెల 14, 15 తేదీల్లో నగరం వేదికగా జరగబోయే భాగస్వామ్య సదస్సులో రూ.పది లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు జరగనున్నట్టు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ సీఐఐ సదస్సుకు దేశ విదేశాల నుంచి మూడు వేల మంది అతిథులు రాబోతున్నారన్నారు. తమ ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేయిస్తే, వైసీపీ నేతలు యువతకు డ్రగ్స్ అలవాటుచేసి వారిని ఉన్మాదులుగా మార్చేస్తున్నారన్నారు. వైసీపీ విద్యార్థి విభాగం నేత కొండారెడ్డి డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే వైసీపీ నేతలు ఎందుకు నోరువిప్పడం లేదని పట్టాభి ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు తీసుకువెళుతున్నారని, అందులో భాగంగానే ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటుచేస్తున్నారన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మాట్లాడేందుకు మైక్ దొరకలేదని, ఇప్పుడు ఖాళీగా ఉండడంతో నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతకుముందు పట్టాభి ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో సీఐఐ సదస్సు కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సదస్సు వద్ద పారిశుధ్య నిర్వహణ, చెత్తసేకరణ, తరలింపు, వంటి అంశాలపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

12 టెండరు దరఖాస్తులు

పద్మనాభం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని క్షేత్రంలో ఈనెల 19న జరిగే దీపోత్సవానికి సంబంధించిన పనుల కోసం దేవస్థానం అధికారులు కుంతీమాధవస్వామి ఆలయంలో గురువారం సీల్డు టెండర్లు పిలిచారు. 12 దరఖాస్తులు రాగా పాటదారుల వివరాలు, టెండరు వేసిన రేట్లను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈఓ రాజు చెప్పారు. దేవస్థానం నిబంధనల మేరకు రేట్లు వేసిన వారిని ఎంపిక చేసి పాటను ఖరారు చేస్తారని తెలిపారు. కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో ఉన్న కల్యాణ మండపం నిర్వహణ కోసం నిర్వహించిన వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో పాటను వాయిదా వేసినట్టు ఈఓ చెప్పారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

భీమునిపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మంగమారిపేటలోని మత్స్యకారులకు కూటమి నాయకులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 4వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నర్సింగరావు, మత్స్యకార నాయకుడు కింగ్, త్రినాథ్‌కుమార్, గరికిన అప్పారావు, పెదఎల్లయ్య, సూరాడ రవి, మండల మత్స్యశాఖాధికారి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఏసీబీ సోదాలు

మధురవాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం కూడా ఏసీబీ సోదాలు కొనసాగాయి. బుధవారం కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అధికారులు వారితో పాటు కొన్నింటిని తీసుకువెళ్లినట్టు తెలిసింది. అలాగే నలుగురు వ్యక్తులను కూడా ప్రశ్నించినట్టు సమాచారం. 296 జీఓ ప్రకారం రిజిస్టర్ చేసిన సుమారు 250 రిజిస్ట్రేషన్ పత్రాలు, మరో 60 ప్రైవేటు రిజిస్ట్రేషన్ పత్రాలపై కూడా విచారణ జరిపారు. గురువారం ఏసీబీ సీఐ మహేశ్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. కొంతసేపు రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారితో మాట్లాడారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని సీఐ తెలిపారు.

జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు ప్రారంభం

ఆనందపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 17 విభాగంలో నిర్వహించిన ఈ పోటీలకు పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనుబాబు, కూటమి నాయకులు విజయబాబు, బి. రాంబాబు, భీమిలి జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, తమ్మిన అప్పలరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కొమ్మాది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్న ఉద్దేశంతో జోన్-2 కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. అలాగే జోన్-2 కార్యాలయంలో ఇప్పటివరకు నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులపై సమీక్ష చేయనున్నారు. ఈమేరకు అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎండాడలో అగ్ని ప్రమాదం

ఎండాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలోని ఎంవీవీ ఫీల్గ్ గేటెడ్ కమ్యూనిటీలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్‌లోని రెండో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న పి. సూర్యకుమార్, ఎస్. మోహనరావు ఇళ్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగింది. వెంటనే అపార్ట్‌మెంట్‌వాసులు అగ్నిమాపక శాఖాధికారి రమణకు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో వచ్చి మంటలను అదుపు వేశారు. రెండు ఇళ్లలో విలువైన వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. వాటి విలువ సుమారు రూ.30 లక్షల ఉంటుందని అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు.

అంధకారంలో పెద్దాస్పత్రి!

... 3వ పేజీ తరువాయి

మారిపోయాయి. రాత్రి 9 గంటలు దాటినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో రోగులు చిమ్మచీకట్లో అవస్థలు పడుతున్నారు. వార్డుల్లో మీద బెడ్ మీద ఉండాల్సిన రోగులు ఆరుబయటకు వచ్చి వరండాల్లో తిరుగాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆస్పత్రి చరిత్రలో ఇన్ని గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దాఖలాలు లేవు. అంతేకాకుండా సమస్యను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఆస్పత్రి పరిపాలనాధికారి గురువారం కేజీహెచ్‌లో లేరు. అత్యవసర చికిత్స విభాగాలకు జనరేటర్‌పై అధిక సమయం విద్యుత్ సరఫరా చేయడం కూడా కష్టమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వార్డుల్లోని రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలియడం లేదు.

ప్లాట్లు కొట్టేస్తున్నారు!

... 3వ పేజీ తరువాయి

రెవెన్యూ, జీవీఎంసీ, ఉక్కు భూసేకరణ విభాగంలో పలువురిని మేనేజ్ చేసి సర్వే నంబరు 13లో మూడు చోట్ల నిర్మాణాలు చేపట్టారని చెబుతున్నారు.

ఫిర్యాదు చేసినా...

అక్రమ నిర్మాణంపై రమాదేవి మహిళా సంఘం ప్రతినిధులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మూడు నెలల క్రితం కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రమాబాయి మహిళా మండలికి కేటాయించిన స్థలంలో రోడ్డు, దానికి ఆనుకుని స్థానికుల అవసరాలకు ఇచ్చిన స్థలానికి కొంతమంది తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి చేపట్టిన నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోరారు. అయినప్పటికీ అధికారులెవరూ స్పందించలేదు.

తప్పులపైనా చర్యల్లేవ్

ఇదిలావుండగా వడ్లపూడి సెక్టార్-1లో నిర్వాసితుడు (ఆర్ నంబరు 767)కి ఇవ్వాల్సిన ప్లాటు నంబరు కాకుండా 680 మంజూరుచేస్తూ గతంలో ఉక్కు భూ సేకరణ విభాగం అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. రికార్డుల్లో నిర్వాసితుడికి 1559 ప్లాటు కేటాయించినట్టు నమోదుచేసిన అధికారులు క్షేత్రస్థాయిలో 680 ప్లాటు ఇచ్చారు. దీనిపై ఎన్ని వినతులు ఇచ్చినా సమస్య పరిష్కరించలేదు. నిర్వాసిత కాలనీల్లో ప్లాట్లు కబ్జాకు నకిలీపత్రాలు సృష్టిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత భూసేకరణ విభాగం స్పందించడం లేదనే వాదన వినిపిస్తోంది. గాజువాక పరిధిలో నిర్వాసిత కాలనీల్లో ప్లాట్లు, సామాజిక అవసరాలకు గుర్తించిన స్థలాలపై సర్వే చేసి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

డిసెంబరుకల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి

... 3వ పేజీ తరువాయి

లేఅవుట్‌లలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, ఇప్పటివరకూ 32 వేలు పూర్తిచేసినట్టు తెలిపారు.పలు కారణాలతో 20 వేల ఇళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. మిగిలిన 50 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఇప్పటివరకూ ప్రారంభించని ఇళ్లపై తరువాత నిర్ణయం తీసుకుంటామని ఎండీ చెప్పారు. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి జిల్లా హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షిస్తూ, పనులు వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మెటీరియల్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సత్తిబాబు, ఎస్ఈ కృష్ణయ్య, ఈఈలు సూరిబాబు, సుబ్రహ్మణ్యం, డీఈ రామకృష్ణ, మేనేజర్ మేరీ గ్రేస్ పాల్గొన్నారు.

వైఫల్యాన్ని దాచిపెట్టి...కాంట్రాక్టర్‌కు దోచిపెట్టి!

... 3వ పేజీ తరువాయి

కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడం మొదలుపెట్టారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం.

రూ.పది కోట్లతో కొత్త యంత్రాలకు ప్రతిపాదన

సీఐఐ సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా గాజువాక సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు అనుకూలంగా ఉన్న కొందరు కూటమి నేతలు ఆయన్ను సీసీఎస్ ప్రాజెక్టుతోపాటు డంపింగ్‌యార్డును పరిశీలించేందుకు రావాలని ఆహ్వానించారు. అక్కడకు ప్రతిరోజూ 300 టన్నుల చెత్త వస్తోందని, సీసీఎస్ ప్రాజెక్టు ద్వారా 70 శాతం మాత్రమే కాపులుప్పాడ తరలిస్తున్నారని, మిగిలినది నిల్వ ఉండిపోతోందని వివరించారు. సీసీఎస్ ప్రాజెక్టు యంత్రాలు పాతవి కావడం వల్లే చెత్తను పూర్తిగా కంప్రెస్ చేసి హుక్‌లోడర్ లోపలకు లోడ్ చేయలేకపోతున్నట్టు ఇంజనీరింగ్ అధికారులతో పట్టాభికి చెప్పించారు. రూ.10 కోట్లతో కొత్తవి కొనుగోలు చేయాల్సింది ఉందని ప్రతిపాదింపజేశారు. కాంట్రాక్టర్‌కు ఏటా రూ.రెండు కోట్లు చెల్లిస్తున్నామని, అయినా సక్రమంగా నిర్వహణ చేపట్టకపోవడం వల్లే యంత్రాలు పనిచేయడం లేదనే విషయాన్ని అధికారులు దాచిపెట్టారు.ఈనేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులు ఆ ప్రతిపాదనలతోపాటు సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా సోమవారం విజయవాడ తీసుకువస్తే మంత్రి నారాయణ, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని పట్టాభి హామీ ఇచ్చారు. అయితే ఒకవైపు పట్టాభిరామ్, అధికారులు యార్డులో తిరుగుతుంటే మరోవైపు ఓపెన్ టిప్పర్లతో చెత్తను బయటకు తీసుకువెళుతుండడం చూసి అక్కడున్న కొందరు అధికారులు ఆశ్చర్యపోయారు. నెలల తరబడి యంత్రాలు పనిచేయకపోయినా కాంట్రాక్టర్ నుంచి రికవరీ ఎందుకు చేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించగా వారంతా పలుకుబడి కలిగినవారు కావడంతోనే తాము ఏమీ చేయలేకపోతున్నామని సమాధానం ఇచ్చారు.

ఏయూలో కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు

» విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించి ఆవిష్కర్తలుగా రూపొందించడమే లక్ష్యం
» వీసీ రాజశేఖర్



గ్రామీణ అనుసంధానం, సంధ్య కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించిన ఏయూ వీసీ జీపీ రాజశేఖర్, పలు విభాగాల ప్రొఫెసర్లు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దే దిశగా కెరీర్ ప్లానింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్టు ఏయూ వీసీ రాజశేఖర్ వెల్లడించారు. ఏయూ గ్రామీణ అనుసంధానం, సంధ్య, ఆలుమ్ని కనెక్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన అకడమిక్ సెనేట్ మందిరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏయూనా పాలనాపరంగా పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొని అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

ఏయూలో దీర్ఘకాలికంగా ఉన్న 28 బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేసినట్టు వీసీ వెల్లడించారు. కారుణ్య నియామకాల ద్వారా ఏయూఉద్యోగుల పిల్లలకుఉద్యోగాలు కల్పించామనిపేర్కొన్నారు.

పాలనాపరంగా కొన్ని మార్పులు

విద్యార్థులకు ఆర్థిక భారాన్ని తగ్గించే విధంగా సర్టిఫికెట్ల జారీకి తత్కాల్ విధానం రద్దు చేస్తున్నామని, సాధారణ రుసుంతోనే సర్టిఫికెట్ల జారీ విధానాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. స్పెషల్ ఎగ్జామినేషన్స్‌ను రద్దు చేస్తూ ఒక సబ్జెక్టులో తప్పినవారికి, ఇన్‌స్టెంట్ పరీక్షను చాలా కాలంగా పరీక్షలు రాయడానికి వేచి ఉన్న వారు సాధారణ ఫీజు చెల్లించి పరీక్ష రాసేందుకు స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం టీడీఆర్-హబ్‌లో ప్రవేశం పొందిన పరిశోధకులకు సంబంధించిన అంశాలపై ఇటీవల అకడమిక్ సెనేట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈనెల 11న పాడేరు డిగ్రీ కళాశాలలో ఏయూ గ్రామీణ అనుసంధానం తొలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 'నా విభాగం - నాకుటుంబం' నినాదంతో విభాగాల్లో బోధన, బోధనేతర సిబ్బంది-విద్యార్థుల మధ్య సమన్వయం, సహకార భావం పెంపొందించే విధంగా 'సంధ్య' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఆలుమ్ని ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పూర్వపు విద్యార్థులను విశ్వవిద్యాలయంతో అనుసంధానించే కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఏయూ లోనికి ప్రవేశమార్గాలను పరిమితం చేయడం ద్వారా అనధికార వ్యక్తులు వర్సిటీలోకి ప్రవేశం నిలువరిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే హాస్టల్స్‌లో కిచెన్, డైనింగ్ గదుల్లో మరమ్మతులు పూర్తి చేశామని, త్వరలో మరుగుదొడ్ల సముదాయాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్స్‌కు ప్రత్యేక ప్రోటోకాల్స్, కోడ్ ఆఫ్ కాండక్ట్ సిద్ధం చేశామన్నారు.

కార్యక్రమంలో ఏయూ రెక్టార్ పి.కింగ్, రిజిస్ట్రార్ కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ ఆర్ రాజు, డీన్‌లు కె.శ్రీనివాసరావు, ఎన్.సాల్మన్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన మ్యాన్‌హోల్స్‌తో రోడ్డు ప్రమాదాలు

» రాత్రి వేళల్లో వాహనదారుల ఇబ్బందులు
» పట్టించుకోని అధికారులు



గాయత్రి స్కూల్ రోడ్డులో మ్యాన్‌హోల్ పరిస్థితి..

మద్దిలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం గాయత్రి స్కూల్ వైపు వెళ్లే రహదారిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. ఇక్కడ అండర్ డ్రైనేజీకి ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ కుంగిపోయింది. మ్యాన్‌హోల్ కుంగిపోవడంతో పెద్ద గుంతల ఏర్పడింది. రోడ్డు మధ్యలో యూజీడీ మ్యాన్ హోల్ కుంగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఇదే రహదారిలో అధికంగా వాహనదారులు రాకపోకలుసాగిస్తుంటారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకునే క్రమంలో మ్యాన్‌హోల్ గుంతకు తగిలి పెద్ద శబ్దాలు వస్తున్నాయి. ద్విచక్రవాహనాలైతే బోల్తా పడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మ్యాన్‌హోల్‌లో పడి గాయాల పాలవుతున్నారు.చీకటి సమయంలో వాహనదారులు ఇక్కడ గుంతకి ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. నెల రోజుల నుంచి మ్యాన్‌హోల్ విరిగి పడి ఉన్నా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, వాహనదారులు అసంతృప్తికి గురవుతున్నారు. పిఠాపురం కాలనీ సీపీఎం కార్యాలయందరి రహదారి పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. అక్కడ రహదారి కుంగిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి సమయంలో ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి గాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



పిఠాపురం కాలనీ సీపీఎం కార్యాలయం సమీపంలో కుంగిన రహదారి

రాష్ట్ర వ్యాప్త సమ్మేటివ్-1 పరీక్షలను వాయిదా వేయండి

» చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం వినతి

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ నిర్వహించనున్న సమ్మేటివ్-1 పరీక్షలను బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాత్కాలికంగా కొద్ది రోజులు వాయిదా వేయాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు.

ఈ విషయమై సీఎం, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్లకు లేఖ రాసినట్టు సీతారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుండి దాదాపు వారం రోజులు పాటు పిల్లల కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య ఈ బాలల దినోత్సవాన్ని గ్రంథాలయ వారోత్సవాల్ని పిల్లలు నిర్వహించుకునే అతి పెద్ద పండుగగా నిర్వహించుకోవడం సంప్రదాయంగా వస్తున్న నేపథ్యంలో ఈ పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని తమ ఫోరం తరపున కోరుతున్నామన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు వాహనాలు

పెదవాల్తేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) నియోజకవర్గానికి 10 చొప్పున మోటారు మూడు చక్రాల వాహనాలు (స్కూటీలు) అందజేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు వెబ్ సైటు : www.apdascac.ap.gov.in ద్వారా 2005, నవంబరు 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు 18-45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం కాళ్లలో (లోయర్ లింబ్స్) వైకల్యం 70 శాతం, అంతకంటే ఎక్కువ వికలత్వం ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ (ఆపరేషన్స్) బి.సింహాచలంనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల పనులు చేపడుతున్న నేపథ్యంలో సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్, దారపాలెం, ముడసర్లోవ పార్కు, కేంద్ర కారాగారం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 26, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 48, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 22, క్యారెట్ 60, దొండకాయలు 40, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



మృతుడు సత్తిబాబు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మేయర్ పీలా

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో విధులు నిర్వహిస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించిన ఉద్యోగి కుటుంబాన్ని అన్ని వేళలా ఆదుకుంటామని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీఎలక్ట్రికల్ విభాగం అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సత్తిబాబు కుటుంబానికి ఎలక్ట్రికల్ విభాగం సమకూర్చిన రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో మేయర్ అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు, ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు



చిన వాల్తేర్‌కు వెళ్లే రహదారిలో వీధి దీపాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సిరిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన రహదారుల్లో రాత్రి వేళ విద్యుత్ విద్యుత్ వెలుగులు ఉండేలా జీవీఎంసీ అధికారులు తగిన ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా రహదారులకు ఇరువైపులా విద్యుత్ దీపాలను అమర్చుతున్నారు. కొన్ని చోట్ల వీధి లైట్లు మరమ్మత్తులకు గురి కాగా, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. సిరిపురం జంక్షన్ నుంచి చినవాల్తేరుకు వెళ్లే దారిలో జీవీఎంసీ విద్యుత్ విభాగం సిబ్బంది ఇందుకు సంబంధించిన పనులు చేపట్టారు. రాత్రి వేళ పూర్తి స్థాయిలో వెలుతురు ఉండేలా ప్రధార రహరులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు అన్నింటికీ లైట్లు అమర్చుతున్నారు.

కూటమి ప్రభుత్వానివి డైవర్షన్ పాలిటిక్స్ : వైసీపీ

మద్దిలపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతోందని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే డ్రగ్స్ కేసులో వైసీపీ విద్యార్థి విభాగం నేతను ఇరికిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 2న డ్రగ్స్ కేసులో కొండారెడ్డిని అరెస్ట్ చేస్తే నిజమేమోనని భావించామన్నారు. కేసుకు సంబంధించిన అంశాలన్నీ పరిశీలిస్తే కుట్రకోణం కనిపిస్తోందన్నారు. 2న ఉదయం 7 గంటలకు జయబేరి రోడ్డులో కొండారెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఎఫ్ఐఆర్‌లో మాత్రం సాయంత్రం 5గంటలకు అరెస్ట్ చేసి నట్టు చూపించడంపై సందేహం వ్యక్తం చేశారు. సాయంత్రం 5గంటలకు అరెస్ట్ చేస్తే ఉదయం 11 గంటలకు కొండారెడ్డి అరెస్టను టీడీపీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో ఎలా పోస్ట్ చేశారని ప్రశ్నించారు. ఎన్సీఆర్‌బీ నివేదికలో మహిళల అదృశ్యం కేసుల్లో రాష్ట్రం ముందుందన్నారు. ఆలయాల్లో కూడా ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అమర్‌నాథ్ విమర్శించారు.

8, 9 తేదీల్లో జూనియర్ లిటరరీ ఫెస్ట్

» ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సొసైటీ డైరెక్టర్లు సంధ్యా, సోనాల్య, ప్రియ, కంకటాల సిల్క్స్ సీఎండీ కంకటాల మల్లిక్, సునీల్, విక్రమ్‌శ్రీధర్

సిరిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం పట్ల పిల్లల్లో ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న జూనియర్ లిటరరీ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని లిట్ లాంతర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్లు కోరారు. గురువారం సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెస్ట్ డైరెక్టర్లు సంధ్యా గోడే, సోనాల్య, ప్రియ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పిల్లల కోసమని గత ఆరేళ్లుగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో బీచ్ రోడ్‌లోని హవా మహల్‌లో జూనియర్ లిటరరీ ఫెస్ట్-2025ను ఏర్పాటు చేశామన్నారు. దేశంలోని వివిధ ప్రచురణకర్తల నుంచి పుస్తకాలు సేకరించి ఫెస్ట్‌లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. విద్యావేత్తలు, చిత్రకారులు, కథకులు పాల్గొని తమ అమూల్యమైన సందేశాలు ఇచ్చేలా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫెస్ట్ ఉంటుందన్నారు. దీనిలో పాల్గొనేందుకు ఇప్పటికే 2 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఆసక్తి ఉన్నవారు నేరుగా హాజరుకావచ్చన్నారు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు కూడా దీనిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. కంకటాల సీఎండీ మల్లిక్ మాట్లాడుతూ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని నిర్వహిస్తోన్న ఫెస్ట్‌లో ప్రతీ ఒక్కరూ పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఫెస్ట్‌కుసంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో పుస్తక వ్యాపారి సునీల్, స్టోరీ టెల్లర్ విక్రమ్ శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపులో మహా నిర్లక్ష్యం




ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులో వీధుల్లో పడి ఉన్న చెట్ల కొమ్మలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో కొన్ని చోట్ల ఇంకా తుపాను మిగిల్చిన నష్టం ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. విరిగిన కొమ్మలు, కూలిన చెట్లను రహదారిపై నుంచి, పక్కకు తోసేసి అలానే ఉంచేశారు. ప్రధాన రహదారుల్లో తుపాను వల్ల వచ్చిన చెత్తాచెదారం వంటివి తొలగించినా, కాలనీల మధ్యలో ఉన్న వాటిని అలాగే ఉంచేశారు. ఈ నెలలో నగరంలో జరగనున్న బిజినెస్ సమ్మిట్‌కు నగరమంతా యుద్ధప్రాతిపదికన అందంగా తీర్చి దిద్దుతున్నారు. అయితే ఆ పనుల బిజీలో పడిన జీవీఎంసీ అధికారులు, సిబ్బంది ఇటు వైపు మాత్రం దృష్టి సారించడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారు ఎటు నుంచి ఎటైనా ప్రయాణించే అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకోవడంతో పాటు, స్థానికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని వెంటనే చెట్ల కొమ్మలు, ఇతర వ్యర్థాలను తొలగించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.



ఆరో సెక్టర్‌లో రోడ్డు పక్కన ఉన్న చెత్తాచెదారం

శ్రీచైతన్యలో రక్తదానం



రక్తదానం చేస్తున్న సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు

వెంకోజీపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోటలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో గురువారం లయన్స్ క్లబ్‌తో కలిపి మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిలో సిబ్బందితో పాటు పలువురు విద్యార్థుల తల్లిదండ్రుల కూడా పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.రమణి మాట్లాడుతూ రక్త దానం అంటే మరొకరికి ప్రాణం చేసినట్టే అవుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమకు వీలున్నంత వరకు రక్తాన్ని దానం చేయాలని, తద్వారా మరొకరికి ప్రాణాలను నిలబెట్టడంతో పాటు రక్త దానం చేసిన వారిలో కూడా కొత్త రక్తం చేరుతుందని, దీనివల్ల పలు రోగాలను కూడా అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ మరియదాసు, లయన్స్ క్లబ్ సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.

సోషల్ వర్కు విభాగం విద్యార్థుల పరిశీలనా యాత్ర



పరిశీలనా యాత్రకు బయలుదేరుతున్న విద్యార్థులు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రాయూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పరిశీలనా యాత్ర గురువారం నిర్వహించారు. మొదటి సెమిస్టర్ విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. మానసిక సంరక్షణ వైద్య కేంద్రం, రాణి చంద్రమణిదేవి వైద్య కేంద్రం, లెబన్స్ హిల్స్ సహాయక కేంద్రాలను సందర్శించారు. సోషల్ వర్కు విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల పరిశీలనా నైపుణ్యాలు, నిర్మాణాత్మక ఆలోచనా విధానం, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడానికి సమాజ సంక్షేమం కోసం సేవా సంస్థలు అందించే సేవల గురించి అధ్యయనం చేయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సోషల్ వర్క్‌విభాగ అచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నెక్' ఫౌండర్ బీవీ రావుకు నివాళి



విద్యార్థులకు కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న 'నెక్' ప్రతినిధులు

ఆరిలోవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ పౌల్ట్రీ నెక్ కంపెనీ ఫౌండర్ డాక్టర్ బీవీరావు జయంతిని పురష్కరించుకొని గురువారం తోటగరువు జిల్లా పరిషత్ విద్యార్థులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నెక్ పౌల్ట్రీ జోనల్ చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఉడగబెట్టిన కోడిగుడ్లను విద్యార్థులకు సరఫరా చేశారు. కార్యక్రమంలో తోటగరువు జిల్లా పరిషత్తు హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎంవీపీ కాలనీలో గల లెబెన్ షెల్ఫ్ స్కూలు విద్యార్థులకు కూడా కోడిగుడ్లను పంపిణీ చేసినట్లు నెక్ ప్రతినిధులు తెలిపారు.

అడిగినంత ఇస్తేనే..అంతిమ సంస్కారం!

- బర్మాక్యాంప్ శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు అధిక వసూళ్లు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పేదలు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డు పరిధి బర్మాక్యాంప్‌లో గల శ్మశానవాటిక జీవీఎంసీ 54, 55, 56, 57, 46, 47, 48, 49 వార్డుల ప్రజల అంతిమ సంస్కారాలకు ఆధారం. రోజూ ఇక్కడకు ఆయా వార్డుల నుంచి 15 వరకు శవాలు దహన సంస్కారాలకు తెస్తుంటారు. అయితే ఇక్కడ నిర్వాహకులు శవాలను తీసుకువచ్చేవారి నుంచి అధికంగా వసూళ్లు చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దహన సంస్కారాలకు తీసుకువచ్చే బాధిత కుటుంబ సభ్యుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో పేదవర్గాల ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇక్కడ శవాన్ని దహనం చేయడానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వసూలు చేస్తుండంతో అంత మొత్తం చెల్లించుకోలేక పేదలు సతమతమవుతున్నారు. ఏదైనా శవాన్ని ఖననం చేయాలంటే కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. దహనం చేసేటప్పుడు రూ.15 వేల నగదుతో పాటుమద్యం కూడా ఇవ్వాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిని నియంత్రించాల్సిన జీవీఎంసీ సిబ్బంది దృష్టి సారించకపోవడంతో వీరి ఆగడాలకు హద్దే లేకుండా పోతుందని పలువురువాపోతున్నారు.


మూసి ఉంటున్న శవాలను భద్రపరిచే గది

వాహనదారులదే పెత్తనం

శ్మశానానికి శవాలను తరలించే వాహనదారులు బాధిత కుటుంబ సభ్యుల నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేలు వరకు ప్యాకేజీ రూపంలో మాట్లాడుకుని అంతా తామే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇంటి దగ్గర నుంచి శవాన్ని తీసుకెళ్లడం మొదలు.. కావాల్సిన సామాగ్రి సమకూర్చడానికి రూ.వేలల్లో బేరాలు పెడుతున్నారు. దీంతో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలు అంత మొత్తం ఇచ్చుకోలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు ఈ అక్రమ వసూళ్లపై దృష్టి సారించి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు..

ఇక్కడ శ్మశానానికి వివిధ కారణాల వల్ల సాయంత్రం ఆలస్యంగా తీసుకువచ్చిన శవాలకు దహన సంస్కారాలు నిర్వహించకుండా భద్రపరచడానికి కొత్త భవనాన్ని నిర్మించారు. దహనసంస్కారాల సమయం ముగిసిన తరువాత తీసుకువచ్చే శవాలను అక్కడ భద్రపరిచి, మరుసటి రోజు కార్యక్రమం పూర్తిచేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ సంబంధిత భవనం ఎప్పుడూ మూసే ఉంటుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల నిధులతో శవం పాడవకుండా పూర్తిగా ఏసీతో ఏర్పాటు చేసిన సౌకర్యం


బర్మాక్యాంప్‌లో శ్మశానవాటిక

అందుబాటులో ఉన్న భవనం తలుపులు తీయకపోవడంతో ఆలస్యంగా వచ్చిన శవాలను శ్మశానం బయట రోడ్డు మీదే ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భవనం నిర్మించిన ప్రధాన ఉద్దేశం నీరుగారుతుంది. ఫ్రీజర్ భవనాన్ని ప్రారంభించే సమయంలో హాజరైన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇక్కడ ఒక బోరు, తాగడానికి మంచినీటిని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సౌకర్యాల మాట పక్కన పెడితే, అసలు భవనాన్ని తెరవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

49వ వార్డులో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మురళీనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) ;జీవీఎంసీ జోన్-5 శానిటరీ సూపర్‌వైజర్ జనార్ధన్ అధ్వర్యంలో గురువారం 49వ వార్డులోని టిఫిన్ సెంటర్లు, పార్లర్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైనఆహారం అందించాలన్నజీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టినట్టు వారు తెలిపారు. ఎన్జీజీవోస్ కాలనీ వద్ద టిఫిన్ సెంటర్‌లో తనిఖీలు చేసి నిర్వాహకుడిపై జరిమానా విధించారు. అపరిశుభ్ర వాతావరణంలో వంటశాల నిర్వహిస్తుండటం, అమ్మకాలు జరిపే ప్రాంతంలో వ్యర్థాలు గుట్టలుగా పడి ఉండడంతో వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున టిఫిన్ దుకాణ యజమానికి అవగాహన కల్పించారు.



టిఫిన్ దుకాణంలో వంటశాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ స్టేఫ్టీ అధికారులు, సిబ్బంది

వ్యాపార కార్యలాపాల్లో రోడ్ల మీద చెత్తలు వేయకూడదని సూచించారు. ప్రజారోగ్య విషయంలో అమ్మకాలు జరిపే ఆహార పదార్థాలు, హోటల్‌కు వచ్చే వారికి అందించే తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టిఫిన్ దుకాణం యజమానికి సూచించారు.

షిర్డీ సాయిధ్యాన మందిరంలో ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలోని షిర్డీ సాయిధ్యాన మందిరంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వైద్య సిబ్బంది భక్తులకు బీపీ, షుగర్, నేత్ర వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ చంటి, టెక్నిషియన్ గోవింద్, వసంత, నర్సింగ్ తరుణ్, అనిషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

కంచరపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 56వ వార్డు పరిధి మల్లసూరివీధిలో గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి సిద్ధార్థనగర్ వరకు గల గౌరీ సేవాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఏటా సంఘం ఆధ్వర్యంలోఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్‌బాబు, సంఘం గౌరవాధ్యక్షుడు కొణతాల సూర్యనారాయణ, అధ్యక్షుడు ఆళ్ల లక్ష్మీనారాయణ, రామప్పడు తదితరులు పాల్గొన్నారు.


దర్శనం చేసుకుంటున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

శ్రీచైతన్య కళాశాలలో రక్తదానం

సీతంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ బి.ఝాన్సీలక్ష్మీబాయ్ 78వ జన్మదినం సందర్భంగా ద్వారకానగర్‌లో గల శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కళాశాల ఏజీఎం కేవీ రమణ, స్కూల్స్ ఏజీఎం ఎంవీ సురేష్‌లు రక్తదానం చేసిన దాతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న అనేక మందికి సహాయం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కాలేజ్, స్కూల్స్‌లో వేలాది మంది రక్తదాన శిబిరాల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల డీన్‌లు, ఆర్‌ఐలు, ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సిబ్బంది

9 నుంచి 11 వరకు బాలోత్సవం

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎయింట్ ఆంథోనీ స్కూల్‌లో వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు బాలోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరుసగా మూడో సంవత్సరం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారికి సర్టిఫికెట్లు, విజేతలకు జ్ఞాపికలు ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు జానకీరామ్, సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

జ్ఞానాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురంలోని వెంకటేశ్వర మెట్ట వద్ద గౌరీ సేవా సంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గవర కంచరపాలెంలో మహిళలు కోటి దీపాలంకరణ, బతుకమ్మ పాటలు పాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మళ్ల రామ్‌ప్రసాద్, రమేశ్, గౌరీ, కాళ్ల రామ గోవింద, బొడ్డేటి జగ్గయ్యమ్మ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు సహకరించిన ఇద్దరి అరెస్టు

ఎండాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డు ఉక్కు ఉద్యోగికి అధిక లాభాలు ఆశ చూపి రూ. 15 లక్షల కొట్టేసిన కేసులో సైబర్ నేరగాళ్లకు అకౌంట్లు అందించిన ఇద్దరిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నగరంలోని కూర్మనపాలెంకు చెందిన రిటైర్డు ఉద్యోగిని (76) టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయం చేసుకుని గోద్రెజ్ ప్రాపర్టీస్ గ్రూపులో యాడ్ చేశారు. ఆయనకు లింక్ పంపించి పార్ట్ టైమ్ జాబ్ చేసుకోవచ్చంటూ మెసెజ్‌లు పెడుతూ కొన్ని టాస్క్‌లు ఇచ్చి కొంతమేరకు నగదు పంపించి నమ్మకం కుదిరేలా చేశారు. తరువాత అతని బ్యాంకు ఖాతా నుంచి ఎన్‌ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్, యూపీ ఐల ద్వారా రూ. 15 లక్షల కొట్టేశారు. ఈమేరకు తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన కొప్పెర విష్ణువర్ధన్, ఏపీలో నంద్యాల జిల్లాకు చెందిన షేక్ హుసేన్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్లాట్లు కొట్టేస్తున్నారు!

... 3వ పేజీ తరువాయి

రెవెన్యూ, జీవీఎంసీ, ఉక్కు భూసేకరణ విభాగంలో పలువురిని మేనేజ్ చేసి సర్వే నంబరు 13లో మూడు చోట్ల నిర్మాణాలు చేపట్టారని చెబుతున్నారు.

ఫిర్యాదు చేసినా...

అక్రమ నిర్మాణంపై రమాదేవి మహిళా సంఘం ప్రతినిధులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని వాపోతున్నారు. దీనిపై 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ మూడు నెలల క్రితం కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రమాబాయి మహిళా మండలికి కేటాయించిన స్థలంలో రోడ్డు, దానికి ఆనుకుని స్థానికుల అవసరాలకు ఇచ్చిన స్థలానికి కొంతమంది తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి చేపట్టిన నిర్మాణాలు నిలుపుదల చేయాలని కోరారు. అయినప్పటికీ అధికారులెవరూ స్పందించలేదు.

తప్పులపైనా చర్యల్లేవ్

ఇదిలావుండగా వడ్లపూడి సెక్టార్-1లో నిర్వాసితుడు (ఆర్ నంబరు 767)కి ఇవ్వాల్సిన ప్లాటు నంబరు కాకుండా 680 మంజూరుచేస్తూ గతంలో ఉక్కు భూ సేకరణ విభాగం అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. రికార్డుల్లో నిర్వాసితుడికి 1559 ప్లాటు కేటాయించినట్టు నమోదుచేసిన అధికారులు క్షేత్రస్థాయిలో 680 ప్లాటు ఇచ్చారు. దీనిపై ఎన్ని వినతులు ఇచ్చినా సమస్య పరిష్కరించలేదు. నిర్వాసిత కాలనీల్లో ప్లాట్లు కబ్జాకు నకిలీపత్రాలు సృష్టిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చినా సంబంధిత భూసేకరణ విభాగం స్పందించడం లేదనే వాదన వినిపిస్తోంది. గాజువాక పరిధిలో నిర్వాసిత కాలనీల్లో ప్లాట్లు, సామాజిక అవసరాలకు గుర్తించిన స్థలాలపై సర్వే చేసి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ

అల్లిపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డులోని మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో 32, 33 వార్డులకు సంబంధించి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఫిర్యాదుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వెంకటేశ్వరమెట్ట భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ నాయకుడు డాక్టర్ చక్రవర్తి స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మూడు నెలల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. మరికొన్ని వినతులను అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి సమస్యలు పరిష్కరించడం సంతృప్తిని ఇస్తుందన్నారు.కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు, కార్పొరేటర్లు బీశెట్టి వసంత లక్ష్మి, కందుల నాగరాజు, జనసేన నాయకులు బీశెట్టి గోపీకృష్ణ, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్టు కేంద్ర క్యాబినెట్ నుంచి డిసెంబరు 31లోగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటన చేయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.40 సంవత్సరాల ఆంధ్రుల ఆత్మగౌరవంతో పుట్టిన టీడీపీని కేంద్ర ప్రభుత్వానికి తాకట్టు పెట్టడం సరికాదన్నారు.ఉక్కు ప్రైవేటీకరణ ఆపుతారా.. లేదా అన్న విషయాన్ని చంద్రబాబునాయుడు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సుందర పిచాయ్ గురించి చంద్రబాబు ప్రగాల్భాలు పలుకుతున్నారని పిచాయ్ పేదవాడు కాదని అపర కోటీశ్వరుడు అని గుర్తుచేశారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు 500 ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల రాయితీ అవసరం లేదని, గూగుల్ కంపెనీ వస్తే లక్షల్లో ఉద్యోగాలు వస్తాయని చెబుతున్న దాంట్లో వాస్తవం లేదని తెలిపారు. రైతుల పరిస్థితి ఏపీలో అధ్వానంగా ఉందని తుఫాన్ వల్ల పది లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రైతుల కష్టాలు తీర్చకుండా తన మిత్రుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లండన్ వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో ఆయనతో విశాఖ జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గారా సూర్యారావు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అబిదా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి చింతా మోహన్

సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని డీఈఓ ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త డా.జె. చంద్రశేఖర్ అన్నారు. గురువారం సమగ్ర శిక్ష విశాఖపట్నం ఆధ్వర్యంలో 11 మండలాల ఎంఈఓలకు శిక్షణ ఇచ్చారు. పిల్లల అభివృద్ధి మరింత మెరుగుపడాలని సూచించారు. సమగ్రశిక్షా అధికారిణి డి. భారతి మాట్లాడుతూ సహిత విద్యా కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఎంఈఓలు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఉప్పలపాటి నీరజా, ఏవీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అడిషినల్ సీడీపీఎం శ్రీలత, రిసోర్స్ పర్సన్స్ బీపీవీ నాగేశ్వరరావు, రవికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరుకల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి

... 3వ పేజీ తరువాయి

లేఅవుట్‌లలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం ప్రారంభించగా, ఇప్పటివరకూ 32 వేలు పూర్తిచేసినట్టు తెలిపారు. పలు కారణాలతో 20 వేల ఇళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయన్నారు. మిగిలిన 50 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఇప్పటివరకూ ప్రారంభించని ఇళ్లపై తరువాత నిర్ణయం తీసుకుంటామని ఎండీ చెప్పారు. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి జిల్లా హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షిస్తూ, పనులు వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మెటీరియల్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్.సత్తిబాబు, ఎస్ఈ కృష్ణయ్య, ఈఈలు సూరిబాబు, సుబ్రహ్మణ్యం, డీఈ రామకృష్ణ, మేనేజర్ మేరీ గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప అంబలం పూజ

డాబాగార్డెన్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ భక్తతుకారామ రామాలయ ఆవరణం అయ్యప్పస్వామి శరణ ఘోషతో మార్మోగింది. శ్రీరామ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్. నరేశ్ సహకారంతో ఈఎస్ కాలనీలోని డీపీఎం పాఠశాల రోడ్డులో గురువారం రాత్రి అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది అయ్యప్పస్వాములు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చి అయ్యప్ప శరణఘోషను పఠిస్తూ స్వామివారిని ఆరాధించారు. కార్యక్రమంలో శ్రీరామ అయ్యప్ప అన్నదానం ట్రస్ట్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ బైపల్లి సోమేశ్, నంది అవార్డు గ్రహీత దుర్గాప్రసాద్ పండా, ట్రెజరర్ గోపీనాథ్ స్వామి, వెంకట రమణచౌదరి, గౌరవ అధ్యక్షుడు టి. కామేశ్, ట్రస్ట్ చైర్మన్ సోమేశ్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక అలంకరణ

రైల్వేక్వార్టర్స్ వైర్‌లెస్ కాలనీలోని శ్రీహరిహరాత్మజ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప పీఠం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గురువారం స్వామిని కాంతార అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

- డాబాగార్డెన్స్, ఆంధ్రజ్యోతి



రెవెన్యూ ఉద్యోగుల క్రీడా సందడి..



అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం నుంచి 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా గురువారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విశాఖ రెవెన్యూ ఉద్యోగులు.

భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు

- తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు
- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14, 15 తేదీల్లో నగరం వేదికగా జరగబోయే భాగస్వామ్య సదస్సులో రూ.పది లక్షల కోట్ల విలువైన పెట్టుబడులకు ఒప్పందాలు జరగనున్నట్టు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ సీఐఐ సదస్సుకు దేశ విదేశాల నుంచి మూడు వేల మంది అతిథులు రాబోతున్నారన్నారు. తమ ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేయిస్తే, వైసీపీ నేతలు యువతకు డ్రగ్స్ అలవాటుచేసి వారిని ఉన్మాదులుగా మార్చేస్తున్నారన్నారు. వైసీపీ విద్యార్థి విభాగం నేత కొండారెడ్డి డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడితే వైసీపీ నేతలు ఎందుకు నోరువిప్పడం లేదని పట్టాభి ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు తీసుకువెళుతున్నారని, అందులో భాగంగానే ప్రపంచ ప్రఖ్యాత గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటుచేస్తున్నారన్నారు. మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మాట్లాడేందుకు మైక్ దొరకలేదని, ఇప్పుడు ఖాళీగా ఉండడంతో నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతకుముందు పట్టాభి ఏయూ ఇంజనీరింగ్ మైదానంలో సీఐఐ సదస్సు కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సదస్సు వద్ద పారిశుధ్య నిర్వహణ, చెత్తసేకరణ, తరలింపు, వంటి అంశాలపై జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

విద్యార్థి ఆత్మహత్య


వీరబాబు (ఫైల్)

సబ్బవరం (అనకాపల్లి జిల్లా), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :స్థానిక జోడుగుళ్ల సమీపంలో వున్న బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడికి చెందిన పత్తిపాటి వీరబాబు(19) స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో ఇంటర్ పూర్తి చేశాడు. అనంతరం ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా ఈ ఏడాది జోడుగుళ్ల వద్దగల బీటీఆర్ డిఫెన్స్ అకాడమీలో చేరాడు. ఈ నేపథ్యంలో ఇంటికి వెళ్లి వస్తానని బుధవారం సాయంత్రం ప్రిన్సిపాల్ బలిరెడ్డి ఉమామహేశ్వరరావుకు మెసేజ్ పెట్టాడు. తమ కుమారుడిని ఇంటికి పంపాలని వీరబాబు తల్లిదండ్రుల నుంచి కూడా సమాచారం వచ్చింది. దీంతో ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారు. గురువారం ఉదయం ఆరు గంటలకు విద్యార్థులంతా పీటీకి బయలుదేరారు. వీరబాబు రాకపోవడంతో వారు ప్రశ్నించారు. తాను ఇంటికి వెళుతున్నానని, ప్రిన్సిపాల్ అనుమతి ఇచ్చారని చెప్పాడు. దీంతో తోటి విద్యార్థులు పీటీకి వెళ్లిపోయారు. తిరిగి 7.20 గంటలకు రూమ్‌కు వచ్చి చూడగా వీరబాబు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పరిశీలించగా వీరబాబు అప్పటికే మృతిచెందాడు. అనంతరం ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జి.రామచంద్రరావు సిబ్బందితో వచ్చి మృతదేహాన్ని కిందకు దించి ల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైఫల్యాన్ని దాచిపెట్టి... కాంట్రాక్టర్‌కు దోచిపెట్టి!

... 3వ పేజీ తరువాయి

కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడం మొదలుపెట్టారు. ఇది నిబంధనలకు పూర్తిగా విరుద్ధం.

రూ.పది కోట్లతో కొత్త యంత్రాలకు ప్రతిపాదన

సీఐఐ సదస్సు ఏర్పాట్లను పరిశీలించేందుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ గురువారం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా గాజువాక సీసీఎస్ ప్రాజెక్టు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌కు అనుకూలంగా ఉన్న కొందరు కూటమి నేతలు ఆయన్ను సీసీఎస్ ప్రాజెక్టుతోపాటు డంపింగ్‌యార్డును పరిశీలించేందుకు రావాలని ఆహ్వానించారు. అక్కడకు ప్రతిరోజూ 300 టన్నుల చెత్త వస్తోందని, సీసీఎస్ ప్రాజెక్టు ద్వారా 70 శాతం మాత్రమే కాపులుప్పాడ తరలిస్తున్నారని, మిగిలినది నిల్వ ఉండిపోతోందని వివరించారు. సీసీఎస్ ప్రాజెక్టు యంత్రాలు పాతవి కావడం వల్లే చెత్తను పూర్తిగా కంప్రెస్ చేసి హుక్ లోడర్ లోపలకు లోడ్ చేయలేకపోతున్నట్టు ఇంజనీరింగ్ అధికారులతో పట్టాభికి చెప్పించారు. రూ.10 కోట్లతో కొత్తవి కొనుగోలు చేయాల్సింది ఉందని ప్రతిపాదింపజేశారు. కాంట్రాక్టర్‌కు ఏటా రూ.రెండు కోట్లు చెల్లిస్తున్నామని, అయినా సక్రమంగా నిర్వహణ చేపట్టకపోవడం వల్లే యంత్రాలు పనిచేయడం లేదనే విషయాన్ని అధికారులు దాచిపెట్టారు. ఈ నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులు ఆ ప్రతిపాదనలతోపాటు సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా సోమవారం విజయవాడ తీసుకువస్తే మంత్రి నారాయణ, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని పట్టాభి హామీ ఇచ్చారు. అయితే ఒకవైపు పట్టాభిరామ్, అధికారులు యార్డులో తిరుగుతుంటే మరోవైపు ఓపెన్ టిప్పర్లతో చెత్తను బయటకు తీసుకువెళుతుండడం చూసి అక్కడున్న కొందరు అధికారులు ఆశ్చర్యపోయారు. నెలల తరబడి యంత్రాలు పనిచేయకపోయినా కాంట్రాక్టర్ నుంచి రికవరీ ఎందుకు చేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించగా వారంతా పలుకుబడి కలిగినవారు కావడంతోనే తాము ఏమీ చేయలేకపోతున్నామని సమాధానం ఇచ్చారు.

అంధకారంలో పెద్దాస్పత్రి!

... 3వ పేజీ తరువాయి

మారిపోయాయి. రాత్రి 9 గంటలు దాటినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోవడంతో రోగులు చిమ్మచీకట్లో అవస్థలు పడుతున్నారు. వార్డుల్లో మీద బెడ్ మీద ఉండాల్సిన రోగులు ఆరుబయటకు వచ్చి వరండాల్లో తిరుగాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆస్పత్రి చరిత్రలో ఇన్ని గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన దాఖలాలు లేవు. అంతేకాకుండా సమస్యను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునే అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఆస్పత్రి పరిపాలనాధికారి గురువారం కేజీహెచ్‌లో లేరు. అత్యవసర చికిత్స విభాగాలకు జనరేటర్‌పై అధిక సమయం విద్యుత్ సరఫరా చేయడం కూడా కష్టమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వార్డుల్లోని రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలియడం లేదు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం

- ప్రజలకు సమస్య లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

పెదగంట్యాడ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండలం రామచంద్రానగర్ దగ్గరున్న డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. జీవీఎంసీ అధికారులతో పాటు గురువారం ఆయన డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అనేక సార్లు ఈ డంపింగ్ యార్డు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారం చూపాలని కోరారని తెలిపారు. ఈ డంపింగ్ యార్డుకు ప్రతిరోజూ ఎన్ని టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి, అందులో ఎంతమేర రీసైక్లింగ్ చేస్తున్నరనే విషయాన్ని యార్డు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు విజయవాడలో ఉన్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు రావాలని జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ డంపింగ్ చుట్టూ పది కాలనీలు ఉన్నాయని, డంపింగ్ యార్డులో చెత్తను డౌన్‌లోడు చేసే సమయంలో, రీసైక్లింగ్ చేసేటప్పుడు వెలువడే కాలుష్యం, దుర్వాసన వల్ల ఈప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యానికి గురవుతున్నారని టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 76వవార్డు కార్పొరేటర్ గందం శ్రీనివాసరావు పట్టాభికి వివరించారు. యార్డును నివాస ప్రాంతానికి దూరంగా తరలించాలని కోరారు. కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ డైరక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరక్టర్ మొల్లి పెంటిరాజు, జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్‌కు త్వరలోనే శాశ్వత పరిష్కారం చేస్తాం


డంపిగ్ యార్డు రికార్డులను పరిశీలిస్తున్న పట్టాభిరామ్

శాశ్వత పరిష్కారానికి కృషి

గాజువాక: జీవీఎంసీ 76వ వార్డులో గల డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ అన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డు వల్ల పలు సమస్యలు వస్తున్నాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతుండడం విచారకరమని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగ ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

ప్రజా సమస్యల పరిష్కారానికే జనవాణి

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన జనవాణి చేపట్టిందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి గురువారం పంచకర్ల హాజరై అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా పంచకర్ల మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను శాఖలపరంగా విభజించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లోని పురాతన శివాలయంలో శివపార్వతులకు కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలనే కొనసాగాలని, ప్లాంట్‌కు పూర్వ వైభవం రావాలని పూజించారు. ఈకార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులుపాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరులకు పూజలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర కాలనీలో గౌరీపరమేశ్వరులకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పసుపు కుంకుమలు తెచ్చి మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో...

అగనంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి షిర్డీసాయి బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరిసర నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సేవా సమితి ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

ఎస్.ఎ.డి.జంక్షన్ నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో బుచ్చిరాజుపాలెంలో ఉన్న గౌరీపరమేశ్వరుల ఆలయంలో భక్తులు కూర్చునేందుకు కార్పొరేషన్ సహకారంతో గురువారం సిమెంట్ బెంచిలను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయంలో వసతి సౌకర్యం కల్పించాలని కమిటీ ప్రతినిధులు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన భక్తులు కూర్చొనేందుకు నాలుగు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ఈనెలలో 45 మంది 'ఉక్కు' ఉద్యోగుల పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో 45మంది స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు పదవి విరమణ చేయనున్నారు. ప్రతి నెల అధిక సంఖ్యలో ఉద్యోగులు పదవి విరమణ చేస్తున్నారు. ఇటీవల కాలంలో వీఆర్ఎస్ ద్వారా సుమారు రెండు వేల మంది పదవి విరమణ చేశారు. పదవి విరమణ చేయడంతో రానురాను ఉద్యోగుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ప్లాంట్‌లో రాన్ను ఏడాదిలో ఎక్కువ సంఖ్యలో పదవి విరమణలు జరగనున్నాయని తెలిసింది.

ఇళ్ల పట్టాలు మంజూరు

సింధియా, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి కొండవాలు ప్రాంతంలో నివాసులకు ఇళ్ల పట్టాలు లేక, సొంతిళ్ల లేక ఇబ్బందులు పడుతున్న వారికి, జీవో నంబరు 30 ప్రకారం 150 గజాల స్థలం ఉన్న వారికి పట్టాలు మంజూరు చేస్తున్నట్టు కార్పొరేటర్ గల్లా గల్లా పోలిపల్లి (చిన్నా) తెలిపారు. చింతలలోవ టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులు దీనిని వినియోగించుకోవాలన్నారు. అలాగే స్థలం ఉండి ఇళ్ల నిర్మాణం చేసుకోని వారు బీఎల్ఎస్ స్కీమ్ ద్వారా సచివాలయంలో అప్లై చేసుకోవాలచ్చని తెలిపారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫెనిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 26, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 48, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయ 38, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 22, క్యారెట్ 60, దొండకాయలు 40, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు(కిలో) 80, అల్లం (పాతది) 64, బరబాటీ48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40,బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 26, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడుచిక్కుడు 70, గోరుచిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్ లెస్	230

ప్రధాన జంక్షన్లలో పశువుల సంచారం

పెదగంట్యాడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ ప్రధాన జంక్షన్‌లలో పశువుల సంచారం వల్ల ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. బీసీ రోడ్డు జంక్షన్, ఫైర్‌స్టేషన్ జంక్షన్, ఎన్టీఆర్ జంక్షన్, వీహెచ్‌సి నాలుగు రోడ్ల కూడలి, నడుపూరు జంక్షన్ వంటి కూడళ్లలో రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎక్కువగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో ఈరోడ్లలో ప్రయాణించే వారికి దగ్గరకు వచ్చే వరకు ఈ పశువులు కనిపించకపోవడం, తీరా దగ్గరకు వచ్చే సరికి వాహనాల వేగాన్ని నియంత్రించలేకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరగుతున్నాయి. బీసీ రోడ్డులో రాత్రి వేళల్లో స్టీల్ ప్లాంట్‌కు రాకపోకలు సాగించే కార్మికులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. నిర్వాసిత కాలనీల్లో పశుపెంపకం దారులు వీటి పాలు తీసుకుని రోడ్డు మీదకు వదిలేస్తున్నారు. ఇవి రాత్రి పగలు రోడ్లమీద తిరుగుతూ దొరికిన వ్యర్థాలను తినుకుంటూ తిరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జీవీఎంసీఈ అధికారులను స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పెదగంట్యాడ పీహెచ్‌సీ జంక్షన్‌లో సంచరిస్తున్న పశువులు

ఆకట్టుకున్న దీపాలాంకరణ

వేపగుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట రవినగర్‌లో ఉన్న బాలత్రిపురేశ్వరి పీఠంలో శివలింగం ఆకరంలో చేసిన దీపాలంకరణ అందరిని ఆకట్టుకుంది. వీటిని చూడటానికి ప్రరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.


శివలింగాకారంలో దీపాలు

వైసీపీ కోటి సంతకాల సేకరణ

ఆటోనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86 వార్డు కూర్మన్నపాలెంలో వైసీపీ వార్డు అధ్యక్షుడు చేగొండి శ్రీనివాసరావు గురువారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులు ఇబ్బందులు పడతారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరించి ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ కార్యకరమంలో గాజువాక వైసీపీ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రెండో రోజూ తనిఖీలు

గాజువాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరగుతున్న ఏసీబీ తనిఖీల్లో భాగంగా గురువారం కూడా పెదగంట్యాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు కొనసాగాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు.

'బౌద్ధం శాంతిని సూచిస్తోంది'

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ మతం శాంతి, సమానత్వాన్ని సూచిస్తుందని, యువత బౌద్ధం వైపు నడవాలని ఉపాసక కర్రి సత్యనారాయణ పేర్కొన్నారు. కార్తీకమాసం సందర్భంగా ఇండస్ట్రీయల్ కాలనీలో ఉన్న బౌద్ధ నిలయంలో దమ్మ ప్రచార కార్యక్రమంలో గురువారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బౌద్ధమత స్వీకరణ అంశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాశకులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు మల్కాపురం శాఖ గ్రంథాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ మాట్లాడుతూ విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా ఆదేశాలు మేరకు ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్‌గ్రేడ్ టెస్ట్‌లు

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలో ఉన్న భారత్ వాడుకై కరాటే అసోసియేషన్ కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడ్ టెస్ట్‌లను గురువారం నిర్వహించారు. ఈ సదర్భంగా కోచ్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే విద్యార్థులు మనోజ్ఞకు బ్లాక్‌బెల్ట్, నేహా, మాన్యశ్రీలకు బ్రౌన్ బెల్ట్, సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.


సర్టిఫికేట్లు తీసుకుంటున్న విద్యార్థులు

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

గోపాలపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో యువకుడు అదృశ్యమైన ఘటనపై గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఏడీ ప్రాంతానికి చెందిన బండారు దిలీప్(29), భాస్కర్(27) అన్నదమ్ములు. బాజీ జంక్షన్ సమీపంలో పాతగోపాలపట్నం రోడ్డులో డెలివరీ ఆఫీసు నిర్వహిస్తున్నారు. ఇదే ఆఫీసులో పనిచేస్తున్న యువతితో దిలీప్‌కు పరిచయం ఏర్పడింది. ఇటీవల దిలీప్‌కు వేరే అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. ఇదిలా ఉండగా వస్తువుల డెలివరీ విషయంలో దిలీప్‌కు, ఆ యువతికి మధ్య ఈనెల 5న ఆఫీసులో గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెందిన దిలీప్ ఆఫీసులో ఉన్న రూ.20వేలు నగదు తీసుకుని వెళ్లిపోయాడు. దిలీప్ తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం సాయంత్రం అతని సోదరుడు భాస్కర్ గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడి సేవలు అజరామరం

- జయంత్యుత్సవాల్లో వక్తలు

పెందుర్తి, నవంబరు 6 (ఆంధ్ర.జ్యోతి): పెందుర్తి నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన రాజకీయ దిగ్గజం ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడని, ఆయన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఎస్ఆర్ఏఎస్ అప్పలనాయుడు శతజయంతి ఉత్సవాల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజు, పీలా గోవింద్ హాజరై ఎస్ఆర్ఏఎస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతానికి ఎస్ఆర్ఏఎస్ ఎన్నో సేవలు చేశారన్నారు. అనంతరం ఎస్ఆర్ఏఎస్ రాజకీయ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఏఎస్ జయంతి నిర్వహించారు. ప్రభు త్వ కళాశాల స్థాపనకు చేసిన కృషిని వివరించారు.


ఎస్ఆర్ఏఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మోటారు వాహనాల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

పెదవాల్తేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శారీరక విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) నియోజకవర్గానికి 10 చొప్పున మోటారు మూడు చక్రాల వాహనాలు (స్కూటీలు) అందజేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు వెబ్ సైటు : www.apdascac.ap.gov.in ద్వారా 2005, నవంబరు 25వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు 18-45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. సదరం ధ్రువీకరణ పత్రం ప్రకారం కాళ్ళలో (లోయర్ లింబ్స్) వైకల్యం 70 శాతం, అంతకంటే ఎక్కువ వికలత్వం ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేస్తున్నట్టు ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. డొంకాడ, బీసీ కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, ప్రాంతీయ ఆస్పత్రి, పెదమడక, పినమడక, గల్లవానిపాలెం, శనివాడ, జాబిలిహిల్స్, పాతఅగనంపూడి, శాంతినగర్, దువ్వాడ సెక్టర్-1, సెక్టార్- 2, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, నంగినారపాడు, వి. కొత్తూరు, అజనగిరి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. పెదముషిడివాడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ-మర్రిపాలెం, గొన్నవానిపాలెం, ఫార్మాసిటీ పునరావాస కాలనీలకు సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

తాత్కాలికంగా కణితి రోడ్డు మూసివేత


కణితి నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారిలో రైల్వే బ్రిడ్జి దగ్గర పనులు

శ్రీనగర్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కణితి రహదారిలో రైల్వే బ్రిడ్జి దగ్గర అండర్ పాస్ పనులు జరగుతున్న క్రమంలో ఈ మార్గాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ పోలీసులు, దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె. వెంకటరావు తెలిపారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. రైల్వే అధికారుల అభ్యర్థన మేరకు కొన్ని రోజులు ఈ రోడ్డును తాత్కాలికంగా మూసివేస్తున్నామని తెలిపారు. అయితే ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగించే ఉక్కు కార్మికులు, ఫార్మా ఉద్యోగులు, విద్యార్థులు, పోర్టు కార్మికులు, వర్తలకు తదితరులు శ్రీనగర్ వడ్లపూడి రైల్వే క్వార్టర్స్ మీదుగా వెళ్లాలని కోరారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ వితరణ

గోపాలపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లపువానిపాలెం గ్రామంలో నివసిస్తున్న పావని అనే దివ్యాంగురాలికి కార్పొరేటర్ వెంకటరమేశ్, కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్ ట్రైసైకిల్, నిత్యావసర సరకులను గురువారం పంపిణీ చేశారు. దివ్యాంగురాలికి రూ.15వేలు పింఛను అందించడానికి కృషి చేస్తానని వెంకటరమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

59వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు శాంతినగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కూటమి నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వార్డులో చాలా చోట్ల రక్షణ గోడలు లేక మట్టి పెళ్లలు విరిగిపడ్డాయని, ఈనేపథ్యంలో దీనిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. అలాగే మాజీ సైనికుల కాలనీలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజల చేశారు. ఈ కర్యాక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో భద్రతకు మరిన్ని పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివ శంకరరెడ్డికి ఇంటక్ చీఫ్ ప్యాట్రన్ మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు పీవీ.రమణమూర్తి తదితరులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రత లోపించిందని, దీంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు భయ పడుతున్నారని అన్నారు. భద్రతపై ప్లాంట్‌లో అవగాహన సదస్సు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులకు, కార్మికులకు పనిముట్లను అందజేయాలన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మల్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డివీధిలో ఉన్న మినీ కల్యాణ మండపంలో రెడ్డి సంఘం సహకారంతో సెయింట్ ఆన్స్ ఆస్పత్రి యాజమాన్యం గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్షుడు కాకిపోలి రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తమ సంఘం నుంచి కొంత సహకారం అందించామని తెలపారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్యసేవలు అందించినందుకు ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్య అధికారులు మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎప్పటికప్పుడు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి హద్దుల ఏర్పాటు

గోపాలపట్నం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్లపువానిపాలెం గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమలో మండల రెవెన్యూ అధికారులు గురువారం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కాలనీలోని సర్వే నెంబర్ 124/3డీ2లో 376 చదరపు గజాల యూఎల్‌సీ భూమి, సర్వే నెంబర్ 122/1లో 394లో చదరపు గజాల ప్రభుత్వ భూమి చుట్టు ప్రహరీ నిర్మించారు.

తాగునీరు వృథా


రోడ్డుపై వృథాగా పారుతున్న నీరు

కూర్మన్నపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. 87వ వార్డు వడ్లపూడి, కణితి, రాజుల పాలెం ప్రాంతాల్లో ప్రధాన తాగునీటి పైప్‌లైన్లకు లీకులు ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొళాయిల్లో నీరు సరిపడా రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతుంటే ఇక్కడ వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి, తాగునీటి వృథాను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సంరక్షణ మన చేతుల్లోనే!

నవజాత శిశువుల ఆరోగ్యానికి భరోసా కల్పించాలి

» అందుబాటులోకి ఆధునిక వైద్య పద్ధతులు

» అవగాహన లేమితో ఇప్పటికీ చిన్నారుల మృత్యువాత



నేడు ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): **గతంలో నవజాత శిశువుల మరణాలు అధికంగా నమోదయ్యేవి. పుట్టుకతోనే అనారోగ్య సమస్యల బారినపడి ఎంతోమంది చిన్నారులు మృతి చెందేవారు. మాతా శిశు మరణాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల ఫలితంగా తగ్గుముఖం పట్టాయి. ప్రజలకు నవజాత శిశువులు ఆరోగ్యం, భద్రతపై అవగాహన కల్పించేందుకు నవంబరు ఏడో తేదీన ప్రపంచ శిశు సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

కొన్నేళ్ల కిందట అమెరికా వంటి దేశాల్లో నవజాత శిశువుల మరణాలు అధికంగా ఉండేవి. వీటిని నియంత్రించేందుకు ప్రదేశాలు పరిశుభ్రంగా ఉంచడం, పరిశుభ్రమైన తాగునీటిని అందించడంపై అక్కడి ప్ర భుత్వాలు దృష్టి సారించాయి. ఫలి తంగా మరణాలు తగ్గుముఖం పట్టడంతో ఏటా నవంబరు ఏడో తేదీన శిశు సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహి స్తూ మరణాలు నియంత్రించేందుకు తల్లిదండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాక్సినేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇది దాదాపు అన్ని దేశాలకు విస్తరించింది.



మరణాల రేటును తగ్గించడం..

ఇన్‌ఫెక్షన్లు, ఇతర అనారోగ్య సమస్యల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షల మంది నవజాత శిశువులు మరణిస్తున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. 2019లో 2.4 మిలి యన్లకుపైగా నవజాత శిశువులు పుట్టిన తొలినెలలోనే మరణించినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ప్రతిరోజూ ఏడువేల మందికిపైగా నవజాత శిశువులు మృత్యువాత పడుతున్నారని తేల్చింది. ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారుల్లో మరణాల రేటు 47 శాతం నమోదవుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. వీటిని తగ్గించేందుకు అవగాహన కల్పిస్తున్నారు. నవజాత శిశువుల మరణానికి ప్రధానంగా గర్భిణిగా ఉన్న సమయంలో మహిళ పోషకాహార లోపంతో బాధపడడమేనని నిపుణులు తేల్చారు. ప్రసవానంతరం పరిశుభ్ర మైన వాతావరణం లేకపోవడంతో ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెం ది మరికొందరు మృతి చెందుతున్నారన్నారు.

ఇవీ జాగ్రత్తలు...

పుట్టిన వెంటనే బిడ్డను పొడిగా, శుభ్రంగా తుడవాలి. వెచ్చగా ఉండేలా చేయాలి. వినికిడి, కంటి, పచ్చకామెర్ల పరీక్షలను చేయించాలి. బొడ్డు తాడు పొడిగా ఉంచాలి లేపనాలు పూయకూడదు. బిడ్డను, తల్లిని ఒకే గదిలో ఉంచి అవసరమైనప్పుడు పాలు అందించాలి. పాలు తీసుకోవడంలో ఇబ్బందులున్నా, వేగంగా శ్వాస తీసుకుంటున్నా, జ్వరం అధికంగా ఉన్నా ప్రమాద సంకేతంగా భావించి వైద్య నిపుణుల వద్దకు తీసుకు వెళ్లాలి.

అప్రమత్తత అవసరం..

నవజాత శిశువులతోపాటు చిన్నారులకు వచ్చే అనారోగ్య సమస్యల పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, మధుమేహ సమస్యలు, సికిల్‌సెల్ వంటి జన్యుపరమైన వ్యాధులు, ఇతర సమస్యలు ఎదురవచ్చు. గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలు, పుట్టిన తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్లు ప్రమాదం కలిగించే అవకాశం ఉంది. సకాలంలో వైద్యుడి వద్దకు తీసుకెళితే ప్రాణహాని తప్పించే వీలుందని నిపుణులు సూచిస్తున్నారు.

అవగాహన అత్యంత కీలకం



బిడ్డ పుట్టినప్పటినప్పటి నుంచి మూడేళ్లు దాటే వరకు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. పరిశుభ్రమైన వాతావరణంతో పాటు ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలి. శిశువు పొట్ట ఉబ్బినట్టు, గట్టిగా అనిపించినా, రెండు లేదా అంతకంటే ఎక్కువ రోజులు మలబద్దకం వేధిస్తున్నా, వాంతులు అవుతున్నా, సరిగా పాలు తాగకపోయినా, తక్కువ మూత్ర విసర్జన చేసినా, మూర్ఛ, ఇతర ఆందోళనకరమైన లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. గర్భం దాల్చిన తరువాత మహిళకు, పుట్టిన బిడ్డకు ఐదేళ్లు వచ్చే వరకు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించాలి.

- డాక్టర్ చంద్రశేఖర్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు, ఘోష ఆస్పత్రి

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

» తృప్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మేయర్ పీలా



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యేలు వెలగపూడి, వంశీకృష్ణ

బీచ్ రోడ్డు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాంటీన్లు నడిపితే స్వయం ఉపాధితో పాటు అటు ఆర్థిక భరోసా లభిస్తుందనే ధ్యేయంతో ప్రభుత్వం తృప్తి క్యాంటీన్లను ఏర్పాటు చేస్తోందని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన తృప్తి క్యాంటీన్‌ను గురువారం ఆయన ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తక్కువ ధరలో టీ, కాఫీ టిఫెన్స్, వెజ్, నాన్ వెజ్, బిరియానీ అందించేందుకు మహిళలతో పథకం అమలుచేస్తున్నామన్నారు. పట్టణాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం క్యాంటీన్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ నగరంలో ఇలాంటి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. స్వయంసహాయక సభ్యులకు ప్రభుత్వం జీవనోపాధి యూనిట్లను ప్రోత్సహిస్తోందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రుణాలిచ్చి ప్రోత్సహిస్తోందని, మహిళా సాధికారితకు తృప్తి క్యాంటీన్లను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముట్టడికి వస్తే పార్టీ కండువా వేస్తాం

» దేశం కోసం బీజేపీలో చేరాలని కాంగ్రెస్ నేతలకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు పిలుపు



బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ కండువాలతో నిరీక్షిస్తున్న బీజేపీ నేతలు

పెదవాల్తేరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు లాసన్స్‌బే కాలనీలోని బీజేపీ కార్యాలయానికి చేరుకోవడానికి ముందుగానే బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు పార్టీ కండువాలతో సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతలంతా బీజేపీలో చేరి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం నాలుగో స్థానానికి చేరిందన్నారు. మొదటి స్థానానికి చేరుకునేలా నిరంతరం శ్రమిస్తున్న ప్రధానిపై కుటిల రాజకీయ విమర్శలు సరికాదని ఖండించారు. గౌరవప్రదమైన ఓటును తక్కువ చేసి మాట్లాడడం దారుణమని, దేశం పరువు, వ్యవస్థలను కించపరిచేలా వ్యాఖ్యలు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉమ్మడి సుజాతరాజ్, ఎస్‌వీఎస్ ప్రకాశ్‌రెడ్డి, బొండాడ నరేంద్ర ప్రకాశ్, మీడియా ఇన్‌చార్జి టి.కోటేశ్వర రావు, కర్యకర్తలు పాల్గొన్నారు.

స్కూలు బస్సు ఢీకొని ఒకరి మృతి

తగరపువలస, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం తగరపువలస కూడలిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి... విజయనగరం జిల్లా రాజాంనకు చెందిన జంపా అచ్యుతరావు (40) స్థానికంగా ఓ మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నాడు. జాతీయ రహదారిని దాటే క్రమంలో పాఠశాల బస్సు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం ఇవ్వలేదని వ్యక్తిపై దాడి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం లేదన్న వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు కత్తితో దాడిచేశారు. నాతయ్యపాలేనికి చెందిన దొడ్డి వెంకటరమణ ఇంటికి రెల్లి వీధికి చెందిన ప్రసాద్, మరో ఇద్దరు వచ్చారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారు రమణను మద్యం కావాలని, డబ్బులు ఇవ్వాలని కోరారు. తన వద్ద మద్యం లేదని చెప్పడంతో వాగ్వాదానికి దిగి, కత్తితో దాడిచేసి పరారయ్యారు. రమణ కేకలు వేయడంతో కుటుంబసభ్యుల ఆస్పత్రికి తరలించారు. గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతమ్మధారకు చెందిన కనపర్తి వీరేందర్, మర్రిపాలేనికి చెందిన జాగు సత్యనారాయణ గుర్తు తెలియనివాహనాలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. వారికి రూ.50 వేలు చొప్పున చెక్కులను సీపీ గురువారం అందజేశారు. ఇప్పటివరకు హిట్ అండ్ రన్ కేసుల్లో గాయపడిన 90 మంది బాధితులు రూ.72 లక్షలు పరిహా రం అందజేశామన్నారు. బాధితులు 7995095793 నంబరు లో సంప్రదించాలన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌ను బెదిరించి నగదు దోచుకున్న ముగ్గురు నిందితులను గురువారం భీమిలి ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశరావు అరెస్టు చేసి, నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి మండలం పినగాడికి చెందిన కచ్చల విష్ణుమూర్తి లారీ యజమాని, డ్రైవరు. గతనెల 14న సాలూరు నుంచి రాజమండ్రికి మొక్కజొన్న లోడుతో బయలుదేరారు 15వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో లారీని ఆపి కేబిన్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా నిందితులు దాడి చేసి రూ.8 వేలు లాక్కున్నారు. మరో వ్యక్తితో కలిసి ఆటోలో పరారయ్యారు.. కేసు దర్యాప్తు చేసిన పోలీసలుఉ నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.500, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కొండపేటకు చెందిన బొట్ట అప్పన్న, తగరపువలసకు చెందిన షేక్ హుస్సేన్, కొప్ప చిట్టిబాబు లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

డైట్‌లో రెండు పోస్టులకు ఒక్కరే హాజరు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నంలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న తెలుగు, వ్యాయామ విద్య అధ్యాపక పోస్టులను డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించేందుకు గురువారం నిర్వహించిన రాత పరీక్షకు ఒక్కరే హాజరయ్యారు. విశాఖ వ్యాలీ స్కూలులో తెలుగు అధ్యాపక పోస్టుకు జరిగిన రాత పరీక్షకు ఎవరూ హాజరుకాలేదు. ఈ పోస్టుకు ఒక్కరే దరఖాస్తుచేసినా రాలేదు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగాయి.

ఢిల్లీ సదస్సుకు వీఎంఆర్‌డీఏ చైర్మన్



విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): న్యూ ఢిల్లీలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్‌పో - 2025కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వెళుతున్నారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆహ్వానం మేరకు జాయింట్ కమిషనర్ కె.రమేశ్‌తో కలిసి వెళుతున్నారు. పట్టణాభివృద్ధి, మౌలిక వసతులు, పర్యాటకం వంటి అంశాలపై సదస్సులో వివరించనున్నారు.

244 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి కృషి

» విశాఖ జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు

» గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్



అనకాపల్లి గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న కృష్ణమోహన్

అనకాపల్లి టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 244 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి ప్రభుత్వానికి నివేదిక పంపామని గ్రంథాలయాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. గురువారం అనకాపల్లి శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షల పుస్తకాలను చదవడం వలన రాష్ట్ర వ్యాప్తంగా 350 మంది పోలీసు కానిస్టేబుళ్లుగా, డీఎస్సీకి 360 మంది ఎంపికై ఉపాధ్యాయులుగా నియమితులయ్యారన్నారు. త్వరలోనే అమరావతిలో రాష్ట్రస్థాయి కేంద్ర గ్రంథాలయం అందుబాటులోకి రానున్నదన్నారు. విశాఖ మహారాణిపేటలో రూ.34 కోట్లతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని, ప్రజలకు గ్రంథాలయాలను చేరువ చేయడమే ధ్యేయమన్నారు. ఆయన వెంట షేక్ పీర్‌అహ్మద్, కుమార్ రాజా, లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, ఆనందరావు ఉన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన

» సమస్యల పరిష్కారం కోసం 8, 9 తేదీల్లో అనకాపల్లిలో మహాసభ

» ఉమ్మడి జిల్లాలో 5,200 మంది కార్యకర్తలు

విశాఖపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాప్‌ల పేరుతో పెంచిన పని ఒత్తిడిని తగ్గించడంతోపాటు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే ఉద్దేశంతో ఈ నెల 8, 9 తేదీల్లో అనకాపల్లిలో మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విశాఖ జిల్లాలో 900 మంది, అనకాపల్లి జిల్లాలో 1500 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2,800 మంది పనిచేస్తున్నారు. ఆశ కార్యకర్తలకు గతంలో ఆరు వేల రూపాయలు వేతనంగా చెల్లించేవారు. 2019లో రూ.10 వేలకు పెంచారు. గడిచిన ఎన్నికల సమయంలో కనీస వేతనం చెల్లిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. గతంతో పోలిస్తే పని మూడు రెట్లకుపైగా పెరిగిందని, ఎన్‌సీడీ సర్వే, ఫీవర్ సర్వే, అభా కార్డులకు ఇంటింటికీ తిరగాల్సి వస్తోందంటున్నారు. ఆ డేటాను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందన్నారు. ఆన్‌లైన్ వర్క్ భారాన్ని తగ్గించి, నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

సింహగిరిని కప్పేసిన మంచు



సింహగిరిపై కురుస్తున్న దట్టమైన మంచు

సింహాచలం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీ నృసింహస్వామి కొలువుదీరిన సింహగిరి, కొండదిగువ సింహాచలం కారిడార్‌ను గురువారం మంచు దుప్పటి కమ్మేసింది. సూర్యోదయం నుంచి సుమారు రెండు గంటలపాటు దట్టమైన మంచు తెరలు కమ్ముకోవడంతో రహదారి కనిపించక వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. కాగా మంచుతో సుందర దృశ్యాలు చూపరులకు కనువిందు చేశాయి.